VISALAANDHRA VIJAYAWADA PHONE No 376

6 నయాపైసలు రిజిష్టరు నెం 193

700294

విజయవాడ - అలంకార్ లో
3వ వారం
మహబూబ్ ప్రొడక్షన్స్
ఆన్ (AAN)
టెక్నికలర్ చిత్రం
నిమ్మి దిలీప్ కుమార్
— నవయుగ

విశాలాంధ్ర

సంపుటి 8] విజయవాడ • 7 అక్టోబరు 1959 • బుధవారం [సంచిక 179

ప్రేక్షకుల కోరికపై
అతిత్వరలో!
విజయవాడ - అలంకార్ లో
బిమల్‌రాయ్ ప్రొడక్షన్స్
మధుమతి
దిలీప్‌కుమార్ వైజయంతిమాల
మొదటినుండి చూడవలసిన చిత్రం! — నవయుగ



భారత-చైనాల వివాదం ఆసియాకూ, ప్రపంచానికీ విపత్కరం

సరిహద్దు సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని శ్రీ జయసూర్య ఉద్బోధ

ఆసియాలో అంతఃకలహాలు రెచ్చగొట్టే శక్తులకు అవకాశ మివ్వరాదని హెచ్చరిక

(విశాలాంధ్ర విలేఖరి)

సికింద్రాబాద్, అక్టోబరు 6

"రెండువేల సంవత్సరాలనుంచీ స్నేహసామరస్యాలు కలిగివున్న భారత-చైనాలమధ్య ఎటువంటి ఘర్షణలు ఏర్పడినా ఆసియాకూ, ప్రపంచానికీ మహా విపత్కరం. ఆసియావాసుల్ని ఆసియావాసులే ఎదుర్కొనాలని కోరుకునే శక్తులకు మనం ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వకూడదు. శాంతియుత సంప్రదింపులద్వారా వివాదాంశాలను పరిష్కరించుకొని, ఉభయదేశాలమధ్య స్నేహ సంబంధాలను కాపాడుకోవాలి" అని నిన్న యిక్కడ దేశోద్ధారక సమితివారు చైనా సరిహద్దు సమస్యపై ఏర్పర్చిన గోష్ఠికి అధ్యక్షత వహిస్తూ మాజీ పార్లమెంటు సభ్యులు డాక్టరు జయసూర్య హెచ్చరించారు.

శ్రీ జయసూర్య ఇంకా ఇలా ఉపన్యసించారు:

మెక్‌మహన్ రేఖ అనేది మ్యాపులలో మాత్రమే వున్నా, దాని ఆధారంగా నిర్దిష్టమైన సరిహద్దు నిర్ణయం ఇంతవరకూ ఏదీ జరుగలేదు. అటువంటప్పుడు మన అసలు సరిహద్దు ఇదీ అని ఏదో నిక్కచ్చిగా చెప్పడం కష్టంగా వుంది. ఈ రేఖనుగూర్చి మొట్టమొదటిసారిగా 1914నాటి ఒప్పందంలో ప్రస్తావించడం జరిగింది. ఈ ఒప్పందం బ్రిటిష్ ఇండియా ప్రభుత్వానికి, టిబెటుకు మధ్య జరిగినది. కాని 1950 వరకు కూడ ఈ రేఖను గూర్చి ఎవ్వరూ ప్రస్తావించలేదు. అప్పటి వరకూ ఎట్టిఘర్షణ జరుగలేదు.

టిబెటుపట్ల భారతప్రభుత్వ వైఖరి, మనదేశంలో దలైలామా తిష్టవేయడం బహుశా ఈ రెండూ నేటి చైనా వైఖరికి కారణమై వుండొచ్చు.

భారత చైనాలు రెండూ యిరుగు పొరుగు మహాదేశాలు. ఉభయదేశాలమధ్యనూ సుదీర్ఘమైన చరిత్రకెక్కిన స్నేహ సంబంధాలున్నాయి. ఇవి ఈనాటివి కావు. రెండువేల సంవత్సరాలనాటివి. అటువంటప్పుడు ఈ రెండు దేశాల మధ్య ఘర్షణలువచ్చి స్నేహ సంబంధాలు చెడిపోతే అది ఆసియాకే కాదు, యావత్ప్రపంచానికే మహా విపత్తు తెచ్చిపెడుతుంది. అందుచేత ఆసియావాసుల్ని ఆసియావాసులే ఎదుర్కొనాలని కోరుకుంటున్న శక్తులకు అవకాశం కల్పించకుండా జాగ్రత్తపడడం మనవిధి. చైనాతో మన స్నేహసంబంధాలను యిదివరకుమాదిరి కాపాడుకోవడమనేది మన ప్రత్యేక బాధ్యతగా వుండాలిగాని ఈ ద్వేషాలకు తావివ్వరాదు. అలాగే ఉభయదేశాలమధ్యనున్న వివాదాన్ని శాంతియుత సంప్రదింపులద్వారానే పరిష్కరించుకోవాలి. అటువంటి సంప్రదింపులకు భారతదేశం మెక్‌మహన్ రేఖ ఆధారంగా వుంచుకున్నా యిబ్బందిలేదు అని శ్రీ జయసూర్య అన్నారు.

తర్వాత శ్రీ రఘునాథరెడ్డిగారు మాట్లాడుతూ యిలా అన్నారు:

అంతర్జాతీయ శాస్త్రరీత్యా మాట్లాడాలంటే, దేశాలమధ్య ఒప్పందాలకు, ఒడంబడికలకు ఆధారం లేదు. వీని తీర్పును యిచ్చేందుకు అంతర్జాతీయ న్యాయస్థానానికి అసలు అధికారం లేదు. అటువంటప్పుడు ప్రస్తుత భారత-చైనా సరిహద్దు సమస్యలోని న్యాయాన్యాయాల్ని గూర్చి మాట్లాడ్డంవల్ల కలిగే లాభ మేమీలేదు. దేశాలమధ్య సరిహద్దుల నిర్ణయానికి అనేక రకాల మార్గాలున్నాయి. వాటిల్లో పర్వత శిఖర ప్రాంతాలకు సంబంధించినది, (వాటర్ షెడ్ (శిఖరశ్రేణి)) లోయలు ప్రారంభమయ్యే (వాటర్ షెడ్‌లైన్) కొన్ని మార్గాలు. మెక్‌మహన్ రేఖను నిర్దిష్టంగా భూమిమీద గీయలేకపోయినప్పటికీ ఉభయదేశాలకు న్యాయసంప్రదాయంగా వస్తున్న సరిహద్దు అటూ వుంది కాబట్టి ప్రస్తుత యథార్థ పరిస్థితికి లోనవుతూనే, సరిహద్దు సమస్యను స్నేహపూర్వక సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవడం మంచిదని ఆయన అన్నారు. మెక్‌మహన్ రేఖ పుట్టు పూర్వోత్తరాలను వివరించి, మొత్తం సమస్యను సంప్రదింపులద్వారానే పరిష్కరించుకోవాలని చివరిగా శ్రీ రఘునాథరెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఐర్లాండుకు బ్రిటన్ బెదిరింపు

ఐరాస కార్యాలయం, అక్టోబరు 6

ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఐర్లాండు ప్రతినిధివర్గ నాయకుడు [illegible] మాట్లాడుతూ చేయబట్టి టిబెట్ ప్రాంతం సమస్యను పురస్కరించుకొని ఐర్లాండువంటి చిన్న దేశాన్ని గురించి "అంత నీచంగా, బెదిరింపులతో కూడిన వైఖరిని" బ్రిటన్ అవలంబించడాన్ని నిశితంగా విమర్శించారు.

బ్రిటిష్ ప్రభుత్వం సోవియట్ దేశానికి, చైనాకు చెందిన ప్రాంతాలలో 12 మైళ్ళలోపున తన నావికా సేనలను ఎందుకు పంపజేస్తున్నదని కూడ ఆయన ప్రశ్నించారు.

"ఇలాంటి విరుద్ధ వైఖరి ఎందుకు తీసుకోవాలి? మేము చాలా చిన్న దేశమనా? చైనా 64 కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న దనా?' అని అడిగారు.

బీహార్, బెంగాల్లో తుపాను బీభత్సం

వేలాది ఇండ్లు కూలి లక్షలాది ప్రజలు నిరాశ్రయులైన వైనం

పాట్నా, అక్టోబరు 6

బీహారు రాష్ట్రంలో గత గురువారంనుంచి వీస్తున్న పెనుగాలి, భారీ వర్షాలవల్ల పాట్నా, గయ, రాంచి, ధన్‌బాద్, దర్భాంగ, ముజఫర్‌పూర్, శరణ్, పూర్ణియా, భాగల్‌పూర్, సహర్స, మోంఘీర్, సంతాలు పరగణాలల్లో అత్యధిక వినాశనం సంభవించిందని ఇక్కడికి అందిన వార్తలవల్ల తెలుస్తోంది.

రాకపోకలన్నీ పూర్తిగా బంద్ అయ్యాయి. వేలకువేలు మట్టి ఇళ్లు నేల కూలిపోయాయి. అనేకమంది చనిపోయినట్లు వచ్చిన వార్తలు అధికారరీత్యా ధృవపడడంలేదు.

పాట్నానగరంవద్ద గంగానదిలో సరుకులు వేసుకొన్న అనేకపడవలు రేవుల్లోనే మునిగిపోయాయి. [illegible] అనేకచోట్ల కూడ 1200 కిరోసిన్ టిన్నులు వేసుకొన్న ఒక పడవ మునిగిపోయింది. అందులో 800 టిన్నులు మాత్రం బయటికి తెచ్చారు.

మోంఘీర్ జిల్లాలో యీ గాలివాన ఉధృతంవల్ల ప్రచండమైన సుడిగాలి వచ్చి ఒకచోట రెండెడ్ల బండి మొత్తంగా ఎగిరి దూరంగా కొట్టుకుపోయి పడింది. బండివాడికి, ఎద్దులకు కూడ బలమైన గాయాలు తగిలాయి.

బెంగాల్లో

దుమ్కా, ఇచ్ఛామతి, జలంగి నదులు ప్రమాదస్థాయిని మించి పొంగి పొర్లుతున్నాయి. దీనివల్ల నాడియా జిల్లాలో రాణాఘాట్ సబ్‌డివిజన్ అధిభాగం నీటమునిగిపోయింది. ఫలితంగా 25 వేల కుటుంబాలు నిరాశ్రయులైనాయి.

దామోదర్, గంగ, అజయ్ నదులు పొంగుటవల్ల శాంతిపూర్, ఛక్దా, రాణాఘాట్ తాలూకాలు జలమయమై పోయాయి.

డాక్టర్ రాయ్ ప్రకటన

పశ్చిమబెంగాల్ శాసనమండలిలో సభ్యుల భత్యాలను పెంచుతూ ప్రభుత్వం ఒక బిల్లును తెచ్చింది. రాష్ట్రంలో వెంటనే వరదల అభివృద్ధి కార్యక్రమాలను చూడడానికి యీ సభ్యులు వెళ్ళితే వారికి ఉచిత రైల్వేపాస్‌లు యిస్తారు. కాని దానిపై ఒక స్వతంత్ర అభ్యర్థి ప్రసంగిస్తూ "రాష్ట్రం అంతా ధ్వంసమవుతూంటే ఇంత సిగ్గుమాలిన అసహ్యకరమైన చర్యకు" ప్రభుత్వం ఎందుకు పూనుకుంటోందో తెలియడంలేదన్నారు.

ముఖ్యమంత్రి డాక్టర్ బిధాన్ రాష్ట్రాన్ని యీ వరదలవల్ల వచ్చిన ప్రమాదాన్నుంచి కాపాడడానికి అవసరమైన చర్యలన్నీ తీసుకుంటున్నామని తెలిపారు.

ఆకాశంనుంచి ఆహారం

బెంగాల్లో వరద ప్రమాదానికి గురైన బర్ద్వాన్, మూర్షిదాబాద్, నాడియా, హుగ్లీ, మిడ్నపూర్ జిల్లాలో మూడు లక్షలమంది నిరాశ్రయులై పోయారు. వీరందరికీ విమానాలనుంచి ఆహారాన్ని అందించే ఏర్పాటు ఆరంభమవుతుంది.

వరదలవల్ల మరో 8 మంది చనిపోయారు. దీనితో మొత్తం చనిపోయినవారు 25 మంది అయ్యారు.

అధికారరీత్యా కాకపోయినా ఇతర రక్షణచర్యల రిపోర్టులవల్ల ఒక లక్షఇళ్ళు కూలిపోయినట్లు తెలుస్తోంది.

బీర్‌భూమ్ జిల్లాలో వరదలకు ఒక లక్ష ఎకరాల వరి పొలాలు నీటు పాలయ్యాయి.

అమెరికా సాయంతో పెట్టుబడి సంస్థ

భారతదేశంలో ఏర్పాటు

న్యూఢిల్లీ, అక్టోబరు 6

భారతదేశంలో ఒక పెట్టుబడి కేంద్రాన్ని స్థాపించే విషయమై భారత ప్రభుత్వానికీ, అమెరికా సాంకేతిక సహకారసంస్థకు మధ్య జరిగిన ఒప్పందంపై నేడిక్కడ సంతకాలు పెట్టారు.

ఈ పెట్టుబడి కేంద్రానికి అమెరికా ఆరంభ పెట్టుబడిగా రూ 87 వేలు ఇచ్చింది. భారతప్రభుత్వం యీ కేంద్ర స్థాపనకోసం చేసుకొన్న కార్యక్రమంలో ఇదొక మొదటి మెట్టు.

ఈ ఆరంభ పెట్టుబడిలో నుంచే భారతదేశానికి తెప్పిస్తున్న ఒక విదేశీ నిపుణునికి అయ్యే ఖర్చులను భరిస్తారు. ఆయన వచ్చి భారత ప్రభుత్వంతోను, అమెరికా సాంకేతిక సహకార సంస్థతోను ఈ పెట్టుబడి కేంద్రపు అధిపతులతోను సంప్రదించి, యీ సంస్థయొక్క నిర్మాణాన్ని, దాని కార్యకలాపాల నిర్వహణా ప్రయాసల్ని పరిశీలించి, యీ పథకాన్ని అమలుపరిచే విధానాన్ని గురించి కొన్ని సిఫార్సులు చేస్తారు.

ఈ కేంద్రం ఒక స్వతంత్రసంస్థగా పనిచేస్తుంది. దీనికి లాభాపేక్ష వుండదట. కాని ప్రభుత్వ సహాయం లభిస్తుందట.

దీని సహాయంతో విదేశాలలో ఎక్కడెక్కడ, ఎంతెంత పెట్టుబడులు భారతదేశానికి లభ్యమయ్యే అవకాశముందో తెలుసుకొనేందుకు కావలసిన విభిన్న సాంకేతిక సౌకర్యాలు చేకూర్చబడతాయి. విదేశాలనుంచీ, స్థానికంగాను వచ్చే వైవిధ్యమైన పెట్టుబడికి కావలసిన సలహాలనిస్తుంది.

నాయర్ సేవా సంఘానికి ఓటమి

త్రివేండ్రం, అక్టోబరు 6

కేరళ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నియామకానికి సలహా ఇచ్చే నిమిత్తం ఒక కమిటీలోకి యూనివర్సిటీ సెనేట్ తరఫున ప్రతినిధి ఎన్నిక జరగవలసివుంది. ఈ సందర్భంలో విమోచన సమరం నిలబెట్టిన అభ్యర్థి శ్రీ పి ఆర్ కృష్ణఅయ్యర్‌కు, శ్రీ మన్నాత్ పద్మనాభన్ నాయర్ సేవా సంఘం నిలబెట్టిన అభ్యర్థి శ్రీ కట్టిమట్ శివరామ పణిక్కర్‌కు తీవ్రమైన పోటీ జరిగింది. శ్రీ కృష్ణఅయ్యర్, శ్రీ శివరామ పణిక్కర్‌పై 18 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

విమోచన సమరం తరువాత నాయర్ నాయకునికి, కేథలిక్ బిషప్పులకు బహిరంగంగా జరిగిన మొదటి ఘర్షణ ఇదే.

శ్రీ కృష్ణఅయ్యర్ సెయింట్ బెర్చ్‌మన్స్ కాలేజి (చంగనాచేరి) ప్రిన్సిపాలు. శ్రీ శివరామ పణిక్కర్ నాయర్ ప్రముఖుడు తిరువాన్కూర్ భూస్వామి. విమోచన సమరంలో పాల్గొన్న కేథలిక్ బిషప్పులద్వారా, కాంగ్రెస్ అనుకూలపత్రికలద్వారా శ్రీ పణిక్కర్ విశేష ప్రచారం పొందారు.

కేరళ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పదవికి శ్రీ జాన్ మత్తయ్ రాజీనామా ఇచ్చినందువల్ల నూతనంగా వైస్-ఛాన్సలర్‌ను నియమించవలసివచ్చింది.

పోలిష్ ప్రధాని భారతదేశం రాక వాయిదా

న్యూఢిల్లీ, అక్టోబరు 6

ఈ నెల మూడవవారంలో భారతదేశం రావలసియున్న పోలిష్ ప్రధాన మంత్రి సిరాంకివిజ్ అనారోగ్య కారణంగా తన భారత సందర్శన కార్యక్రమాన్ని వాయిదా వేసుకొన్నారని అధికారవర్గాలద్వారా తెలుస్తోంది.

అమెరికాలో దలైలామా సోదరుడు

న్యూయార్క్, అక్టోబరు 6

ఇండియా భూభాగంనుంచి జరిగే చైనా వ్యతిరేక ప్రచారంలో ప్రధాన పాత్ర వహిస్తున్న దలైలామా అన్న గ్యాలో తోండుప్ నేడిక్కడికి లండన్‌నుంచి వచ్చిచేరారు.

తాను "టిబెట్టు స్వాతంత్ర్యాన్ని గురించి వాదించడానికి" యిక్కడికి వచ్చాననీ, ప్రవాసంలో నున్న ప్రభుత్వానికి విదేశాంగ మంత్రిగా, ఐక్యరాజ్యసమితిలో టిబెట్టు ప్రతినిధివర్గానికి నాయకుడుగా వుంటున్నాననీ వర్ణించుకొన్నారు.

చైనా తనరాకకు దలైలామా ఉత్తరువులు కూడ వున్నాయని తెలిపారు.

శాంతినికోరే వారందరూ తమకు సహాయపడాలనికూడ విజ్ఞప్తిచేశారు.

భద్రతాసమితికి పోలెండు అభ్యర్థిత్వం

ఐరాస కార్యాలయం, అక్టోబరు 5

ఈ ఏడాది ఆఖరుకు జపాను సభ్యత్వకాలం పూర్తికావడంతో ఐక్యరాజ్యసమితియొక్క భద్రతాసమితిలో ఖాళీ అయ్యే స్థానానికి టర్కీకి ప్రత్యర్థిగా పోలెండు తప్పకుండా నిలబడుతుందని పోలిష్ విదేశాంగ మంత్రి ఆడం రపాకీ నేడిక్కడ తెలియజేశారు.

ఒకవేళ ఆ పోటీమీద జరిగే ఓటింగు ఇతమిద్ధంగా తేల్చక పోయినట్లయితే పోలెండు ఉపసంహరించుకోవడం జరగదనీ, ఆ విషయాన్ని సర్వసభ్య సమావేశం తేల్చవలసి వుంటుందనీ తెలిపారు.

సూరత్ సమీపంలో నూనె గనులు

సూరత్, అక్టోబరు 6

నూనెకొరకు ప్రత్యేకంగా జరుపుతున్న దగా నూర్ సమీపంలోని మహావేజ్ వద్ద ఖనిజవాయువు పైబడ్డది. 800 అడుగులలోతున ఇది లభించింది.

ప్రత్యేకంగా 6 వేల అడుగులవరకు సాగిస్తారు. అప్పటికిగాని నూనె [illegible] లభించవు.

మహావేజ్‌కు అరమైలు దూరంలో నూనె ఉన్నట్లు జూన్ 24న బైటపడిన విషయం పాఠకులకువిదితమే. అక్కడ 800 అడుగుల లోతునకే నూనెపొరలు దొరికాయి.

విద్యావంతులు అన్ని పనులకూ సిద్ధంగా వుండాలి

ప్రొఫెసర్ కబీర్ ఉద్బోధ

తిరువనంతపురం, అక్టోబరు 6

విద్యావంతులు ఏవో కొన్ని రకాల ప్రత్యేక పనులకు మాత్రమే అంటిపెట్టుకు పోవాలనే దృక్పథం ప్రమాదకరమయినదని కేంద్ర శాస్త్ర పరిశోధన, సాంస్కృతికశాఖ మంత్రి ప్రొఫెసర్ హుమయూన్ కబీర్ నేడిక్కడ అన్నారు. ఈ విషయాన్ని ఎంత త్వరగా గుర్తిస్తే దేశానికి అంత మంచి చేకూరుతుందని ఉద్బోధించారు.

కేరళ యూనివర్సిటీ 30వ స్నాతకోత్సవ సందర్భంలో ప్రసంగిస్తూ శ్రీ కబీర్ పై విధంగా చెప్పారు.

ఆయన యింకా యిలా అన్నారు: కొన్నిరకాల పనులకు అంటిపెట్టుకు వుండాలనే వైఖరికి ఆధునిక ప్రపంచంలో స్థానంలేదు.

ఈ విషయాన్ని మనం త్వరగా గుర్తించాలి. ఏపనినైనా విద్యావంతులైన స్త్రీ పురుషులే సాధించగలరని గుర్తించాలి. విద్యావంతులైన నిరుద్యోగులుగా వున్నవారిని ప్రత్యేక సమస్యగా భావించడం బహుశా భారతదేశంలోనే వింటాం. నిరుద్యోగుల్ని ఈ విధంగా వర్గీకరించడ మేమిటో నాకు అర్థంకాకుండా వుంది.

నిరుద్యోగ సమస్య ఏ వర్గానికి చెందినా మంచిదికాదు. విలువైన మానవ బలగాన్ని సమాజం సద్వినియోగించుకోలేకపోవడమే ఈ నిరుద్యోగానికి కారణం. ఇటువంటి పరిస్థితి యింక ఎంత మాత్రం కొనసాగనివ్వకుండా చూడాల్సివుంది' అన్నారు.

ఢిల్లీకి నెహ్రూ ప్రయాణం

పూనా, అక్టోబరు 6

ప్రధాని నెహ్రూ నేడు పూనా నుండి ప్రత్యేక విమానంలో బయల్దేరి ఢిల్లీ వెళ్ళారు.

ఆంధ్రలో విద్యాభివృద్ధికి రు 30 కోట్ల వ్యయం

తృతీయ ప్రణాళికలో

హైదరాబాద్, అక్టోబరు 6

ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యాప్తికి గాను మూడవ పంచవర్ష ప్రణాళికలో ముప్ఫై కోట్ల రూపాయలు కేటాయించబడ్డాయని విద్యాశాఖ డైరెక్టరు డాక్టరు ఎస్ రామలాల్ సెప్టెంబరు 30వ తేదీ పాఠశాలాంతర గ్రౌండ్స్‌లో జరిగిన ఒక సభలో చెప్పారు.

చంద్రుని సమీపిస్తున్న రష్యా అంతర్గ్రహ కేంద్రం

ఇప్పటికి మూడింట రెండువంతుల దూరం పయనం

మాస్కో, అక్టోబరు 6

సోవియట్ ప్రయోగించిన అంతర్గ్రహ కేంద్రం నేటి రాత్రి 10-40 గంటలకు చంద్రునికి గల దూరంలో మూడింట రెండువంతులకు పైగా ప్రయాణం చేసినట్లు అధికారరీత్యా ప్రకటించారు. ఈ రాకెట్ ఇప్పటికి 1 77 500 మైళ్ళు ప్రయాణం చేసింది.

ఈ రాకెట్ నేటి రాత్రి 7 30 గంటలకు చంద్రునికి సమాంతరరేఖను చేరుకుంటుంది. అప్పటికి చంద్రుని ఉపరితలానికి రాకెట్ 4850 మైళ్ళ దూరంలో ఉంటుంది.

అక్కడ నుండి విలువైన శాస్త్రీయ సమాచారాన్ని రాకెట్ అందజేస్తుంది.

ఈ రాకెట్ చంద్రమండల పరిధిలో ప్రవేశించటానికి మూడురోజులు పడుతుందని మొదట అనుకున్నారు. కాని ఇప్పుడు 2½ రోజులలోనే గమ్యస్థానం చేరుతుందని అంచనా వేస్తున్నారు.

శాస్త్రవేత్తల భావం

మాస్కో, అక్టోబరు 6

సోవియట్ యూనియన్ ప్రయోగించిన అంతర్గ్రహ యాన

(మిగతా 4వ పేజీ)

గోదావరి వరదలకు శాశ్వత నివారణ మార్గమేది?

మంత్రుల పరస్పర విరుద్ధ ప్రసంగాలు

(విశాలాంధ్ర విలేఖరి)

హైదరాబాదు, అక్టోబరు 6

గోదావరి, కృష్ణానదులను కలపడమే గోదావరి వరదలకు పరిష్కారమార్గం అని ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారు ఇటీవల వరదప్రాంతాలను చూచివచ్చిన తర్వాత పత్రికా విలేఖరులతో అన్నారు.

ఇదే విషయాన్ని మద్రాసు కార్పొరేషన్ ఉత్సవాల సందర్భంలో వారు పునరుద్ఘాటించారు. గోదావరి, కృష్ణా నదుల జలాలను ఆంధ్రరాష్ట్రమేకాక, ఇతర రాష్ట్రాలుకూడా వాడుకొనే విధంగా ఒక స్కీము తయారుచేయమని ఇంజనీర్లను ఆదేశించినట్లు వెల్లడి చేశారు.

ఈ స్కీముపై ఇంత మోజు చూపుతుండటం రాజకీయ రంగంలో అనేక అనుమానాలకు దారితీస్తూంది.

ఇదివరలో ఈ స్కీము గురించే శ్రీ సంజీవరెడ్డిగారు ప్రస్తావించటం, దక్షిణ జోన్ కౌన్సిల్లో చర్చించటం, అటువంటి స్కీము నొకదానిని తయారుచేయమని ఉభయ రాష్ట్రాల ఇంజనీర్లను ఆదేశించటం, దానిపై అసెంబ్లీలో శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, తదితరులు అనుమానాలు వెలిబుచ్చుతూ ఇది కృష్ణా పెన్నారు పథకాన్ని దొడ్డిదారిని ప్రవేశపెట్టడమే అవుతుందని విమర్శించారు.

మనకు మిగిలిన జలాలతో ఇవ్వటం జరుగుతుందని, ఇందులో అనుమానానికి తావు లేదని ముఖ్యమంత్రి అభయమిచ్చారు.

ఇప్పుడు గోదావరి వరదల అదను చూచుకొని ఈ నినాదాన్ని ప్రజల ముందుంచటం, వరదల నివారణను దానికి ముడిపెట్టడ మాస్త్రే, ఇందులో రాజకీయాల ప్రమేయం ఏమైనా వుండాలని అనుమానం కలుగుతున్నది.

ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారే గత సంవత్సరం వరదల సమయంలో మాట్లాడుతూ, శబరినది పొంగటమే గోదావరి వరదలకు ప్రధాన కారణం కాబట్టి, దానిమీద ఒక ప్రాజెక్టు కట్టడమే వరదలకు నివారణ మార్గమని అన్నారు.

పోచంపాడు ప్రాజెక్టు కట్టడం ఈ గోదావరి వరదలకు రెండవ తరహా పాత్రమని కూడ చెప్పారు.

కొన్నటి పత్రికా విలేఖరుల సమావేశంలో శ్రీ సంజీవరెడ్డిగారు మాట్లాడుతూ, పోచంపాడు దాటినతర్వాతనే ఉపనదులు వచ్చి కలుస్తున్నాయి కాబట్టి అది వరద నివారణకు ఉపయోగపడదని చెప్పారు.

కాబట్టి రెండుల ముఖ్యమంత్రిగారే ఇటువంటి విషయాల్లో "ఇదొక్కటే పరిష్కారం" అని ఉద్ఘాటించటం, అనుచితమని ఇక్కడ భావించబడుతోంది.

మరి శబరి ప్రాజెక్టు సంగతేమిటి? సంజీవరెడ్డిగారి యీ అభిప్రాయాలు విన్న ప్రజలు ఏది నివారణ పథకంగా భావించాలి?

గోదావరి వరద నివారణ విషయంలో చీఫ్ సెక్రటరీ పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ, రామపాద సాగర్ ప్రాజెక్టు ఒకటే శరణ్యమన్నారు.

కందప్రాంతాలు పర్యటించివచ్చిన మంత్రి భాగ్యారావుగారు ఫలానా ప్రాజెక్టు అని నామకరణం చేయక పోయినా, ఒకటి, రెండు రిజర్వాయర్లు కట్టడమే నివారణకు మార్గమని అభిప్రాయపడ్డారు.

ఇరిగేషన్ మంత్రి శ్రీ జె వి నరసింగరావుగారు విలేఖరులతో మాట్లాడుతూ, రెండుకోట్ల రూపాయల ఖర్చుతో గోదావరి కుడి, ఎడమ గట్లను బలపరచటమే శాశ్వత నివారణ పథకమని సూచించారు.

ఇక తమ అనుభవజ్ఞులైన మన ఇంజనీర్లు ఏమంటున్నారో ఎవరికీ తెలియదు.

మంత్రివర్గ సభ్యులలోనే యిన్ని అభిప్రాయాలున్నాయి అంటే, "ఇదొక్కటే శరణ్యమార్గం" అని ఉద్ఘాటించేకన్నా, అనుభవజ్ఞులైన ఇంజనీర్లతో సంప్రదింపులు జరపాల్సిన అవసరం కనిపిస్తోంది.

అవసరమనుకుంటే కేంద్ర జలవిద్యుత్ సంఘంవారి అధ్వర్యాన గోదావరినది ప్రవహించే రాష్ట్రాల ఇంజనీర్ల సమావేశం జరిపి, చర్చించి ఒక నిర్ణయానికి రావటం సముచితంగా వుంటుంది.

అలాగే అధికార స్థాయిలోగాని, అనధికార స్థాయిలోగాని, గోదావరి వరదలకు గురవుతూన్న నాలుగు జిల్లాల ప్రతినిధుల సమావేశం జరిపి, అనధికారుల ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను కూడా సేకరించవచ్చు.

మన కున్న పరిమితమైన ఆర్థికవనరుల దృష్ట్యా గోదావరినీటిని కృష్ణలోకి మళ్ళించే పెద్దపథకాన్ని చేపట్టగలమా? అవి తయారయ్యేటంతవరకూ గోదావరి తీరవాసులు ప్రతి సంవత్సరం ఈ కాలంలో అరచేత ప్రాణాలు పెట్టుకొని బ్రతుకవలసిందేనా? లేక తక్కువ ఖర్చుతో చిన్నపథకాలను తీసుకొని ఆ ఆశయాన్ని సాధించగలమా? కనీసం వరద తీవ్రతనైనా తగ్గించగలమా? గోదావరికి 1953 లోనూ ఇప్పుడూ వచ్చినంత పెద్దవరదలు [illegible], రాజమండ్రి నగరం, తూర్పు ముఖ్యంగా లంకప్రాంత ప్రజలు ధనప్రాణ నష్టాలకు గురికావటం జరుగుతూంది. కాబట్టి పై వరద నిరోధక పథకాలతో నిమిత్తం లేకుండా గట్లను ప్రజలకు శాశ్వత రక్షణ కల్పించటం ఎలా? ఈ విషయాలన్నీ పై సమావేశాల్లో చర్చనీయాంశాలుగా వుండాలి.

వరద వచ్చిన సమయంలో పెద్ద గొంతు చెయ్యటం, ఆ తర్వాత సమస్యను మాటుపెట్టటం 'మామూలు [illegible]' విధానానికి స్వస్తి చెప్పి సత్వరం శాశ్వత, తాత్కాలిక నివారణ పథకాల విషయంలో ప్రభుత్వం కదిలేటట్లు ప్రజలు ఒత్తిడి చేయాల్సివుంది.

వికారి నామ సంవత్సర
ఆశ్వయుజ శుద్ధ
పంచమి ఉ 7-51
షష్టి తె 5 25

విశాలాంధ్ర

బుధవారం 7 10 1959

గవర్నరు పాలన

కేరళ కమ్యూనిస్టు మంత్రివర్గాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి అచ్చట గవర్నరు పాలన ఏర్పరచి రెండు నెలలకు పైగా గడిచింది 1960 ఫిబ్రవరిలో తిరిగి ఎన్నికలు జరపటానికి ప్రభుత్వం సన్నాహాలను చేస్తున్నది.

అయితే గవర్నరు పాలన ఏర్పడిన మరుక్షణం నుండి రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి మరింత అధ్వాన్నమవుతూ వచ్చింది కాంగ్రెసు పార్టీ వలంటీర్లు, విమోచన సమర సమితి వలంటీర్లు కమ్యూనిస్టులపైన, వారి సానుభూతి పరులపైన చేస్తున్న దౌర్జన్య చర్యలు మితిమీరుతున్నాయి పోలీసులు శాంతి భద్రతలను కాపాటం లేదు సరిగదా, విమోచన సమర సమితి వాలంటీర్ల రౌడీ చర్యలకు తోడ్పడిన ఘటనలు అనేకం ఉన్నాయి

రాష్ట్రపతిపాలన ప్రారంభమైన మొదటి 40 రోజులలోనే 235 ఘర్షణలు జరిగినట్టు పోలీసులు కందిన నివేదికలే వెల్లడిస్తున్నాయి పార్లమెంటులో కమ్యూనిస్టు సభ్యులు శ్రీ ఎ టి పున్నూస్ ఉద్రిక్త ప్రాంతాలలో పర్యటించి గవర్నరుకొక నివేదికను సమర్పించారు రౌడీలు, వ్యవసాయకూలీలపైన పేద ప్రజలపైన జరుపుతున్న దాడులకు పోలీసులు మద్దతు ఇస్తున్నదని సవివరంగా తమ నివేదికలో వివరించారు

కేంద్ర తిరువాన్కూర్ ప్రాంతంలోని తిరువల్ల తాలూకా పరిమళ అనే గ్రామంలో వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన ఒక వృద్ధ స్త్రీ రౌడీ దాడి ఫలితంగా మరణించింది వ్యవసాయ కూలీల ఇళ్లు ధ్వంసం చేయబడ్డాయి అదే తాలూకాలో ఒక కాలేజీ విద్యార్థి హత్యచేయబడ్డాడు కమ్యూనిస్టు సానుభూతిపరుడుగా ఎంచబడే ఒకపోలీసు సబిన్‌స్పెక్టర్‌ను కూడా హత్య చేశారు

చెంగనూరు తాలూకాలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోటానికి వెళ్ళిన పత్రికా విలేఖరులపై విమోచన సమర సమితి రౌడీలు దాడి చేసి వారి కాగితాలను లాక్కొన్నారు పోలీసులను వెంటబెట్టుకొని ఈ రౌడీలు వ్యవసాయ కార్మికుల ఇండ్లలో దూరి విధ్వంస కార్యక్రమం సాగించారు.

కేరళలో నేడు పెద్దఎత్తున జరుగుతున్న దౌర్జన్యకాండకు ఇవి కొన్ని మచ్చుతునకలు మాత్రమే

సక్రమ పద్ధతిలో ఎన్నికలు జరగాలంటే, రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఏర్పడటం అవసరం ఈ సమస్యపై గవర్నరు వివిధ పార్టీల ప్రతినిధులను సమావేశ పరచి శాంతి స్థాపనకై సంయుక్త ప్రకటన చేయాలని కోరారు ఒక్క కమ్యూనిస్టుపార్టీ మినహా మిగతా అన్నిపార్టీలూ ఇందుకు నిరాకరించాయి ఇది గమనార్హమైనది తిరిగి ఎన్నికలు జరిగే వరకు ఇదే ఉద్రిక్త వాతావరణాన్ని రాష్ట్రంలో కొనసాగించుటే, కాంగ్రెసు మున్నగు కమ్యూనిస్టేతరపార్టీల లక్ష్యమని స్పష్టమవుతుంది

ఇంతకు పూర్వమే నిర్ణయమై పోయిన నియోజక వర్గాలను మార్చే ప్రయత్నం కూడా జరుగుతోంది క్విలన్ జిల్లాలోని రన్ని నియోజక వర్గంలోని కొన్ని ప్రాంతాలను అదే జిల్లాలోని కంజీరపల్లి నియోజకవర్గంలోకి ఎన్నికల కమిషన్ మార్చింది ఇది చాలా అక్రమమని రాజ్యాంగానికే విరుద్ధమని పార్లమెంటు సభ్యులు శ్రీ ఈశ్వరయ్యర్ ఖండించారు పార్లమెంటుకు మినహా, మరెవ్వరికీ రాష్ట్రపతికిగాని, అతని ప్రతినిధి అయిన గవర్నరుకుగాని, నియోజక వర్గాలను తారుమారు చేసే అధికారం లేదని శ్రీ ఈశ్వరయ్యర్ స్పష్టం చేశారు

కేరళలో ఎలాగైనా ఎన్నికలలో గెలవాలని, కులమత సంస్థలతో కాంగ్రెసు ఒప్పందం చేసుకున్నది ఈ ఒప్పందాన్ని అగ్రనాయకత్వం ఆమోదించింది రాష్ట్రంలో విచ్చలవిడిగా దౌర్జన్యకాండను సాగిస్తున్నది నియోజక వర్గాలను ఎన్నికల కమిషన్ మార్చివేస్తున్నది

ఇలాంటి వాతావరణంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరగటం అసంభవం

చట్టబద్ధంగా ఎన్నికైన కమ్యూనిస్టు మంత్రివర్గాన్ని గద్దె దింపటంలోనే, కాంగ్రెసు నాయకత్వం ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నుపోటు పొడిచింది అదే ప్రజాస్వామ్య వ్యతిరేకధోరణి నేటికీ కొనసాగుతున్నది

ఈ ధోరణులు కొనసాగరాదని దేశంలోని ప్రజాస్వామ్యవాదులందరూ ఆందోళనచేయాలి స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటు వినియోగించుకోగల పరిస్థితులను కేరళలో ఏర్పరచాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నాం

జర్మన్ ప్రజా రిపబ్లిక్ దశమ వార్షికోత్సవం

అక్టోబరు 7వ తేదీతో తూర్పు జర్మనీలో ఏర్పడిన ప్రజాస్వామిక రిపబ్లిక్‌కు పదేళ్ళు నిండాయి ఈ పదేళ్లలో కైజర్ల, హిట్లర్ల జర్మనీతో తూర్పుజర్మనీ తెగతెంపులు చేసుకుంది కాని పశ్చిమ జర్మనీ ఆ నిరంకుశుల పోకడనే నడుస్తోంది

మొదటి యుద్ధానంతరం కైజర్ పోయాడు కానిఅతనిసేనానులుఅలాగే వుండిపోయారు రెండవ యుద్ధంలో హిట్లరు నశించాడు కాని అతని సేనానులకు పశ్చిమ జర్మనీ నిలయంగానే వుండిపోయింది

కాని తూర్పు జర్మనీలో నాజీ సేనానులు, జంకర్లు, గుత్త దోపిడీదారులు చరిత్ర శిథిలాలలో కలిసిపోయారు. 8,90,478 మంది నాజీలు ప్రభుత్వ ఉద్యోగాల నుండి, ప్రజాసంస్థలనుండి తొలగించబడ్డారు 7 వేల పెద్ద పెద్ద భూకమతాలను ముక్కలుగొట్టి,44 079 మంది రైతులకు వ్యవసాయ కార్మికులకు. తూర్పు జర్మనీ భూసంస్కరణను కొనసాగించింది 1945లో జనవాక్య నిర్ధారణ పద్ధతిని ప్రజాభిప్రాయాన్ని సేకరించి 79 శాతం అనుకూలతపై ఆధారపడి పరిశ్రమలను జాతీయం చేసింది

1949లో రిపబ్లిక్ ఏర్పడిన సమయానికి తూర్పుజర్మనీ యింకా యుద్ధానంతర బాధలనుండి, ఆకలి దప్పుల నుండీ విముక్తి పొందలేదు పెద్ద పెద్ద పరిశ్రమ లున్న భాగం పశ్చిమ జర్మనీగా రూపొందగా వెనకబడివున్న వ్యవసాయిక ప్రాంతమే తూర్పు జర్మనీగా విభజన అయింది అయినా సోషలిస్టుసమాజ లక్ష్యంతో తూర్పు జర్మనీ పురోగమించింది

పారిశ్రామికాభివృద్ధి

ఈ పదేళ్ళలోనూ పారిశ్రామికోత్పత్తి విషయంలో తూర్పుజర్మనీ యూరప్‌లో అయిదవ స్థానాన్ని అందుకున్నది 1953 నాటికే మొత్తం పారిశ్రామికోత్పత్తిలో 88 శాతం జాతీయం చేయబడిన పరిశ్రమలే ఉత్పత్తి చేశాయి 1950తో పోల్చితే 141 శాతం అదనంగా 1958లో పారిశ్రామికోత్పత్తి జరిగింది

వ్యవసాయం అభివృద్ధి చెందింది భూసంస్కరణ తర్వాత క్రమేపీ వ్యవసాయోత్పత్తి సహకార క్షేత్రాలు అభివృద్ధి చెందాయి 1959 నాటికి 8,95 000 మంది ఐచ్ఛికంగా అమరవంతో చేరుకొని యీ క్షేత్రాలలో సభ్యులుగా చేరారు మొత్తం సాగుభూమిలో 40 శాతం యీ క్షేత్రాల పరంగా వున్నది ఈ క్షేత్రాలలో 59.8 స్వంతట్రాక్టర్లు యితర యంత్ర పరికరాలు వున్నాయి 1959లో అధిక సంఖ్యాక వ్యవసాయదారులు ఇటువంటి క్షేత్రాలలో చేరగలరని ఆశిస్తున్నారు 1951లో ట్రాక్టర్లు, యితర వ్యవసాయ యంత్రాలుగల కేంద్రాలు 127 మాత్రమే వుండగా ఇప్పుడవి 4078 వరకు అభివృద్ధి అయ్యాయి రైతాంగపు శ్రమ బాగాతగ్గి వారికి విశ్రాంతి, విజ్ఞానం ఎక్కువగాలభించే అవకాశాలు కలిగాయి

ప్రజల జీవనస్థాయి పెరుగుదల

సమష్టి కృషికి తూర్పుజర్మని ప్రాధాన్యమిస్తోంది పారిశ్రామికంగా వనరులరీత్యా సంపన్నమైయున్న పశ్చిమ జర్మనీతో పోటీపడి ప్రజల జీవనస్థాయిని పెంపొందించడానికితీవ్ర కృషి కొనసాగిస్తోంది 1961 నాటికి దాదాపు అన్ని వాడుక పదార్థాల విషయంలోనూ తలసరి వాడకంలో పశ్చిమజర్మనీని మించాలని కృషి చేస్తోంది ఇప్పటికే పశ్చిమజర్మనీ తలసరి వెన్న వాడకం 16పౌనులు కాగ తూర్పు జర్మనీలో 26 పౌనులున్నది పశ్చిమ జర్మనీలో పంచదార వాడకం 61పౌనులు కాగా, తూర్పుజర్మనీలో 67 పౌనులున్నది చేపల వాడకం పశ్చిమ జర్మనీలో 26 పౌనులు, తూర్పు జర్మనీలో 28 పౌనులు. కెమేరాలు, సైకిళ్ళు, కుట్టుమిషన్ల వాడకంకూడా తూర్పు జర్మనీలో ఎక్కువే

కనీస అవసరాలు తీర్చే విషయంలో పశ్చిమజర్మనీనితూర్పుజర్మనీ బాగ మించిపోయింది అద్దె ఆహారం, కరెంటు, బంగాళాదుంపలు, రొట్టె మొదలైనవి తూర్పు జర్మనీలో చౌకగా లభిస్తున్నాయి ట్రాం, బస్, రైలు, సినిమా టిక్కెట్లుకూడా పశ్చిమజర్మనీ కంటె చాలా చౌక

పోగా వైద్య, విద్య, సెలవుల విశ్రాంతి విషయంలో తూర్పుజర్మనీ పశ్చిమ జర్మనీనిమించి అనేక సదుపాయాలు ఉచితంగా కలిగిస్తోంది

తూర్పు జర్మనీలోఉన్న జనసంఖ్య మొత్తం సుమారు 2 కోట్ల మంది అయినా 1958 నాటికి యిక్కడ 8,61,000 మంది పసిబిడ్డలకు బాలబాలికలకు ఆశ్రయం యివ్వగల 2088 నర్సరీలు, 7521 కిండర్ గార్డెన్లూ నడుస్తున్నాయి ప్రసవించడానికి ముందూ వెనకా 11 వారాలపాటు నిండు జీతంతో తల్లులు సెలవు పొందగలుగుతున్నారు మొదటి బిడ్డకు 500 మార్కులతో ప్రారంభమై రెండవ బిడ్డకు వెయ్యి మార్కులవరకూ అదనంగా ప్రభుత్వం బహూకరిస్తోంది

విద్యాభివృద్ధి

1957 ఫిబ్రవరి నుండీ అన్ని కాలేజీల్లోనూ హైస్కూళ్ళలోనూ విద్యార్థులకు ఉచిత విద్యా సౌకర్యం ఏర్పడ్డది జీతం లేకపోవడమే గాక నూటికి 94 మంది నెలకు 180 మార్కుల వరకు స్టయిపెండులు పొందగలుగుతున్నారు నెలకు వెయ్యి మార్కులకు మించిన ఆదాయంగల వారి బిడ్డలకు మాత్రమే యీ స్టయిపెండు సహాయం కల్గించడంలేదు బాగా ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంకా బోనస్‌లను కూడా యిస్తున్నారు అందరికీ వైద్యసహాయం ఉచితం

విద్యార్థుల్లో నూటికి 60 మంది కార్మిక కర్షకుల బిడ్డలు

సోవియట్ సహాయంతోనూ, సోషలిస్టు విధానంతోనూ తూర్పు జర్మనీ రిపబ్లిక్ మహత్తర పురోగమనాన్ని సాగిస్తోంది అనేక దేశాలతో సన్నిహిత సాంస్కృతిక సంబంధాలను పెంపొందించుకోవడానికి కృషి చేస్తోంది

తూర్పుజర్మనీ ప్రధాని ఆటో గ్రోటే వాల్ యీ సంవత్సరారంభంలో భారతదేశం వచ్చి వెళ్ళారు తూర్పు జర్మన్ వర్తకప్రతినిధివర్గం కూడా పర్యటించి వెళ్ళింది

భారతదేశానికి సహాయం

భారతదేశానికి తూర్పు జర్మనీకి మధ్య గత సంవత్సరంలో 8 కోట్ల రూపాయలవరకు వ్యాపారం జరిగింది మనదేశపు రూపాయి నాణెంతోనే వ్యాపారం చేయడానికి తూర్పు జర్మనీ సిద్ధంగావున్నది భారీయంత్రాలను, చిన్న యంత్రపరికరాలను తూర్పు జర్మనీ మనదేశానికి ఎగుమతిచేస్తోంది తేయాకు, జనపనార, మిరియాలు, చెప్పులు వగైరా మనదేశంనుంచి దిగుమతి చేసుకుంటోంది మూడవ ప్రణాళికా కాలంలో భారతదేశానికి యంత్ర పరికరాల విషయంలో సహాయం చేయడానికి సిద్ధంగా వున్నది

భారత ప్రభుత్వం జర్మన్ డెమొక్రటిక్ రిపబ్లిక్‌ను గుర్తించకపోవడం చేత వర్తక, వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలలో యింకా అనేక యిబ్బందులు కలుగుతూనే వున్నాయి ఆ గుర్తింపు జరిగితే యీ రెండు రాజ్యాల మైత్రి ఉభయులకూ శ్రేయోదాయకంగా వర్ధిల్లగలదు

సిద్ధాంతాలు నూరిపోసే పద్ధతి తగదు

ఉపరాష్ట్రపతి హెచ్చరిక

అహ్మదాబాద్, అక్టోబరు 5

సిద్ధాంతాలు నూరిపోసే పద్ధతిగాని, హద్దులు మీరిన స్వేచ్ఛాప్రవృత్తి గాని నిజమైన విద్యాలక్ష్యాలు నెరవేరడానికి ఏమాత్రం దోహదం చేయవని ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ నేడిక్కడ ఉపాధ్యాయుల శిక్షణ కళాశాల నూతన భవనానికి ప్రారంభోత్సవం చేస్తూ చెప్పారు

శ్రీ రాధాకృష్ణన్ యింకా యిలా అన్నారు పై రెండు పద్ధతుల్లో మనం దేనినీ కాంక్షించడంలేదు బాలబాలికలకు సరియైన శిక్షణ గరిపి, వారిని విజ్ఞాన రహదారుల పట్టించడం మన బాధ్యత అంతేగాని మన అభిప్రాయాలు వారిపైబలవంతానరుద్దడం తగదు తన అభిప్రాయమేమిటో చెప్పి, దానిని వ్యక్తులనిర్ణయానికి వదలడమొక్కటే సరైన ఉపాధ్యాయుడు చేయవలసిన పని విశ్వాసం నూరిపోయడం పేరుతో పిల్లలకు మానసిక స్వేచ్ఛ లేకుండాచేయడం తగని పని

దేశంలో విద్యాభివృద్ధికి ఇప్పుడున్న అవకాశాలే చాలవు వాటిని యింకా అభివృద్ధి చేయాలి ఈసమస్య నేడు చదువుతున్న నిరుద్యోగుల సమస్యతో ముడిపడివుంది విద్యావంతులైన వారిని ఉపాధ్యాయులుగా మారేందుకు తగు శిక్షణ యివ్వవలసిన బాధ్యత విద్యాసంస్థలదని నా అభిప్రాయం తత్ఫలితంగా నిరుద్యోగ సమస్యను కొంతవరకు తగ్గించవచ్చు తద్వారా నిరక్షరాస్యతను మాడారూపు మాపడానికి అవకాశం ఏర్పడుతుంది

"పది సంవత్సరాల్లోగా మన దేశంలోని బాలబాలికలందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యావకాశాలు కల్గించేయాలని మన రాజ్యాంగం నిర్దేశించింది ఈ కాలపరిమితిని తృతీయ ప్రణాళికాంతానికిపొడిగించారు అయినప్పుడు దేశంలో అప్పటికైనా రాజ్యాంగ లక్ష్యాన్ని నెరవేర్చి, దేశంలో నిరక్షరాస్యతను, నిరుద్యోగ సమస్యను పరిష్కరించగలిగివుండాలి ఇందుకు ఇప్పటికంటె మరికొంత ధనం అవసరం విద్యావ్యాప్తికి ఇది అవసరం దేశంలో విద్యా సంస్థలన్నీ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, ఐక్యతా భావాన్ని, అంతర్జాతీయ దృక్పథాన్ని పెంపొందించడానికి కృషి చేయాలి త్వరితగతిని మార్పు చెందుతున్న ప్రపంచంలో నిత్యసంబంధాలు వుండడానికి ఇదొక్కటే అవసరమని శ్రీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు

ఆస్ట్రేలియాలో భారత హైకమిషనర్

న్యూఢిల్లీ, అక్టోబరు 5

ఆస్ట్రేలియాలో భారత దేశ హైకమిషనర్‌గా పనిచేయటానికి భారత విదేశాంగశాఖలో సహాయ కార్యదర్శి శ్రీ సమరేంద్రనాద్ నియమితులైనారు వీరు న్యూజిలాండ్‌కు కూడ హైకమిషనరుగా వుంటారు వచ్చే నవంబరులో బాధ్యత పుచ్చుకుంటారు

కాకోద్కర్ అరెస్టు

ప్రముఖ గోవానాయకులు

కార్వార్, అక్టోబర్ 5

ప్రముఖ గోవానాయకుడైన శ్రీ పురుషోత్తం కాకోద్కర్‌ను నేడు అధికారులు గోవాలో అరెస్టు చేశారు ఈయన ప్రస్తుతం పాన్‌జిమ్‌వద్ద గోవా పోలీసుల కస్టడీలో వున్నారు

శ్రీ కాకోద్కర్ కార్వార్ గోవా సరిహద్దువద్దనున్న అంగాడీగ్రామంలో ఒక కార్మిక కేంద్రాన్ని నెలకొల్పాక తన నిర్మాణ కార్యక్రమాన్ని కొనసాగించుటకు నెందుకు ఈయన గోవాలో పర్యటించడానికి అధికారులు అనుమతి నిరాకరించారు కూడా అనేకసార్లు ఈయన గోవాలో ప్రవేశించారు కాని ఈసారి ఒకటవ తేదీన సరిహద్దును దాటినప్పుడు పోర్చుగీసు పోలీసులు ఈయన్ని అరెస్టు చేశారు

కాకోద్కర్ 1946లో అరెస్టయినప్పుడు 11 సంవత్సరాల జైలు శిక్ష విధించబడింది ఆ తర్వాత ఈయనను పోర్చుగల్‌కు ప్రవాసం పంపారు. 1954లో విడుదల చేయబడ్డారు

గ్రామానికో నర్సు

అవసరమని శ్రీ వి వి. గిరి

వారణాసి, అక్టోబరు 5

ప్రతి గ్రామానికి కనీసం ఒక నర్సు వుండడం అవసరమని ఉత్తర ప్రదేశ్ గవర్నరు శ్రీ వి వి గిరి నేడిక్కడొక సందర్భంలో అన్నారు

గ్రామాలలో కొంతకాలం వినియోగపడే నర్సులను శిక్షణ చేయాలన్న డిమాండ్‌ను ఆమోదించాలంటే నర్సు, మంత్రసాని పనులను నెరవేర్చే అనేకపు సిబ్బందికి సంబంధించిన కోర్సును ప్రవేశపెట్టడం అవసరమన్నారు

'భారత-చైనాలమధ్య పెద్ద ఘర్షణవుండదు'

—శ్రీ నెహ్రూ అభిప్రాయం

పూనా, అక్టోబరు 5

భారత చైనాలమధ్య పెద్ద ఘర్షణ ఏమీ సంభవించదనే తాను భావిస్తున్నానని ప్రధాని నెహ్రూ నేడిక్కడ అన్నారు అయితే భారతదేశం ఎల్లప్పుడూ అప్రమత్తతతోను, సమైక్యతతోను మెలగాలని ఇటీవల సరిహద్దు పరిణామాలు బోధిస్తున్నాయని ఆయన అన్నారు

పూనా మునిసిపల్ కార్పొరేషన్ తన గౌరవార్థం చేసిన సన్మాన సందర్భంలో ప్రసంగిస్తూ శ్రీనెహ్రూ పై విధంగా చెప్పారు

ఒకదేశం ఐకమత్యంతో వుండక పోతే, అది తన బలహీనతను ఉపయోగించుకోవటానికి మరో దేశానికి వీలు కల్పించుకోవడమే నన్నారు

ఆయన యింకా యిలా అన్నారు

"అనేక చిన్న చిన్న సమస్యలపై మనమధ్య మనకే విభేదాలుండవచ్చు కాని పెద్దపెద్ద సమస్యలపై మనం అంతా కలిసి కట్టుగా సమైక్యతతో వుండాలి దేశానికి! బయటినుండి వచ్చే సవాలును ఎదుర్కోడానికి సిద్ధపడివుండాలి అప్రమత్తతతో వుండాలంటున్నా నంటే సైన్యంచేతులు ముడుచుకువుంటుందనికాదు అర్థం దాని పని అది నెరవేరుస్తుంది అన్నిటి కంటే ప్రధానమైనదేమంటే సైన్యంవెనకవుండే "బలం" ప్రజల ఐక్యత, దేశ సంపద శక్తిసామర్థ్యాలు, ఇవే ఆ బలం ఇతరదేశాలతో స్నేహంతో మసలుకోవడమే ఎప్పుడూ భారతదేశ విధానంగా వుంది ఇది విజయం పొందింది కూడా ఈ విధానమే భారత చైనాల మధ్యకూడా గతంలో విజయం పొందింది కాని ఇటీవల టిబెట్టులో వచ్చిన ఘటనలు, కొత్తగా తలెత్తినసరిహద్దుసమస్య ఈవిజయాలను వెనక్కి నెట్టాయి సరిహద్దు సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందనే నా ఆశ

చైనా ప్రభుత్వం తెలిపిన అభిప్రాయాలతో నేను ఏకీభవించలేదు ఇటీవల నేను చైనా ప్రధానికి వ్రాసిన లేఖలో భారతదేశ దృక్పథమేమిటో స్పష్టంగా తెలిపాను సాధారణంగా రెండు దేశాల మధ్య జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలను ప్రచురించడం జరగదు కాని కొంతకాలం క్రితం చైనా ప్రభుత్వం ప్రధాని చౌ-ఎన్-లై వ్రాసిన లేఖను ప్రసారం చేసింది అందుచేత నేనుకూడాచైనాప్రధానికి వ్రాసిన లేఖను ప్రచురించాలని నిశ్చయించాను తర్వాత భారతదేశ వైఖరేమిటో దేశప్రజలూ, యావత్ప్రపంచమూ తెలుసుకుంటుంది

"శాంతిస్థాపన, భారత చైనాల ప్రయోజనాల దృష్ట్యా ఉభయులు ఇకముందుకూడా స్నేహంతో మెలగడం అవసరం కాని అందుకోసమని భారతదేశం "మించిన మూల్యాన్ని చెల్లించడానికి సిద్ధంగా లేదని" ఆయన అన్నారు

అధికార వికేంద్రీకరణ

గ్రామ పంచాయతీలకు ఎక్కువ అధికారాలు సంక్రమించాలని శ్రీ నెహ్రూ

పూనా, అక్టోబరు 5

"నేను అధికార వికేంద్రీకరణవైపు మొగ్గు ఎక్కువగా వుంది అందుచేతనే భారతదేశం అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రధాన బాధ్యతలను గ్రామ పంచాయతీలకు సంక్రమింపజేయడంద్వారా అధికార వికేంద్రీకరణకు ప్రయత్నిస్తోంది" అని ప్రధాని నెహ్రూ నేడిక్కడొక పెద్ద బహిరంగసభలో మాట్లాడుతూ అన్నారు

ప్రధాని నెహ్రూ యింకా యిలా అన్నారు

"ఆర్థిక రంగానికి సంబంధించినంతవరకు సహకార సంఘాల నిర్మాణం పట్ల యెక్కువ శ్రద్ధ చూపబడుతోంది ఈ విధంగా భారతదేశం తన ప్రత్యేక పరిస్థితులకు అనుగుణమైన నూతన పంథా త్రొక్కడానికి ప్రయత్నిస్తోంది మనం ఎన్నుకున్న ప్రజాతంత్ర పద్ధతికి ఈ మార్గం తగినట్టుగా ఉంటుంది. భారతదేశం పెట్టుబడిదారీ పద్ధతుల్నిగానీ, కమ్యూనిజం పద్ధతులనుగాని కాపీకొట్టడం లేదు అయితే ఈ రెండు పద్ధతులవల్ల కలిగిన అనుభవాలను తన స్వీయాభివృద్ధికి భారతదేశం వినియోగించుకో వచ్చు

"దారిద్ర్య నిర్మూలనకుజరిగే పోరాటంలో దేశాభివృద్ధికితోడ్పడేది శాస్త్ర విజ్ఞానమూ, సాంకేతిక విజ్ఞానమూ" నని ఆయన అన్నారు

తర్వాత బొంబాయి ద్విభాషా రాష్ట్ర సమస్యను గూర్చి ప్రస్తావిస్తూ, ఇది శాంతియుతంగా పరిష్కారం కావాలని కోరారు

కృష్ణమీనన్ పాత్ర

"భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత, వివిధ రక్షణ సంస్థల్లో ఏ రక్షణమంత్రి తీసుకురాలేని మార్పులను గత మూడు సంవత్సరాల్లో శ్రీ కృష్ణమీనన్ మంచి చొరవతో తీసుకువచ్చారు ఆయన మంచి పద్ధతుల దేశరక్షణకు ఆయుధోత్పత్తి కర్మాగారాలు, రక్షణ విజ్ఞానశాస్త్రా వెన్నెముకలంటివి ఈ రెండురంగాలలోను శ్రీ కృష్ణమీనన్ అభివృద్ధిని కనపరిచారు ఈనాడు మన ఆయుధ పరిశ్రమ ట్రక్కులను ఉత్పత్తి చేయడం ప్రారంభించింది ఇవి మార్కెట్ ధరలకన్నా తక్కువ ఖరీదుకు లభిస్తున్నాయి ఇకపోతే విమానాలను ఉత్పత్తి చేయడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

"ఇక జనరల్ తిమ్మయ్య విషయానికి వద్దాం ఈయన తన రాజీనామా లేఖను పంపినమాట వాస్తవమే నా ప్రోద్బలంవల్ల ఆ రాజీనామాను శ్రీ తిమ్మయ్య ఉపసంహరించుకున్నారు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో, ప్రధానమంత్రి పదవి చాల ప్రధానమైనది ప్రధాన మంత్రియే మంత్రివర్గాన్ని ఎన్నుకున్నది అందుచేతనే మొత్తం రంగానికి ప్రధాన మంత్రి ప్రధాన పోషకుడు శ్రీ మీనన్, శ్రీ తిమ్మయ్యలు ప్రధాన మంత్రి విశ్వాసాన్ని కోల్పోవుంటాయితే, ప్రధానమంత్రి మరో పద్ధతిని అవలంబించివుండేవాడు అందుచేత వారిపై విమర్శలు తగవు అటువంటి విమర్శలవల్ల దేశానికి ఏ మంచీజరుగదు" అని అన్నారు

శ్రీ నెహ్రూ స్వతంత్రపార్టీ విధానాలను విమర్శిస్తూకూడామాట్లాడారు

కంతేరు పంచాయతీ ఎన్నికలు

కమ్యూనిస్టుల విజయం

కంతేరు, అక్టోబరు 6

గుంటూరుతాలూకా కంతేరుగ్రామ పంచాయతీబోర్డుకు 5 10 59న ఎన్నికలు జరిగినవి అన్ని వార్డులలోనూ ఏకగ్రీవముగా దిగువసభ్యులు ఎన్నికైనారు

1 తెలగోటేరసి హోరెడ్డి (కాం) 2 మర్రెడ్డి సాంబిరెడ్డి (క) 3 వానిరెడ్డి మల్లిఖార్జునరావు (క) 4 వనిరెడ్డి సాంబశివరావు (క) 5 కర్రి ఏసోబు (క) 6 కర్రి వెంకయ్య (క) 7 చుక్కా సూర్యనారాయణ (క) 8 జానపల్లి చంద్రయ్య (క) యీ ఎనిమిదిమందిలోను మొదటివారు తప్ప మిగతా ఏడుగురు కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు

సంయుక్త మహారాష్ట్ర సమితి పార్లమెంటరీ బోర్డు సమావేశం

బొంబాయి, అగస్టు 5

సంయుక్తమహారాష్ట్ర సమితి పార్లమెంటరీబోర్డు నేడు ఆరు గంటలసేపు సమావేశమై భారత చైనా సరిహద్దు వివాదంపైన, బొంబాయి ద్విభాషా రాష్ట్ర సమస్యపై కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం నిర్ణయాన్నిగూర్చి చర్చించింది

భారత సరిహద్దు వివాదంపట్ల సమితి లోని వివిధపార్టీల దృక్పథం ఎలా వుండాలన్న విషయమై చర్చించింది

లోక్‌సభ స్పీకరు మలయా సందర్శన

కౌలాలంపూర్, అక్టోబరు 5

లోక్‌సభాధ్యక్షులు శ్రీ మాడభూషి అనంతశయనం అయ్యంగారు మలయాలో రెండురోజులు పర్యటించడానికి అక్టోబరు 7వ తేదీన కౌలాలంపూర్ చేరుకుంటారు

హిందీభాషా వ్యాప్తి

రాష్ట్రపతి ప్రసంగం

పాట్నా, అక్టోబరు 5

హిందీ సాహితీవేత్త లందరూ భాషా వివాదాలలో తలదూర్చకుండా హిందీభాషను మరింత పరిపుష్టం చేయడానికి తమ శక్తియుక్తు లన్నింటిని వినియోగించాలని రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేడిక్కడ బీహార్ రాష్ట్ర భాషా పరిషత్ 8వ వార్షిక మహాసభను ప్రారంభిస్తూ చెప్పారు

పరిషత్‌వారు శ్రీ రాజేంద్రప్రసాద్ రచించిన ఒక పుస్తకానికి, ప్రఖ్యాత హిందీ రచయితగానూ ఆయనకు రూ 2510 లను బహుమతిగా యిచ్చారు ఇందుకుకృతజ్ఞతతెలుపుతూ రాష్ట్రపతి 5 వేలను పరిషత్‌కు విరాళంగా యిచ్చారు

ఆయన యింకా యిలా ప్రసంగించారు

హిందీ జాతీయ భాషగా వుండాలని రాజ్యాంగం ప్రకటించిన తర్వాత గాని, మరికొద్ది కాలంలో గాని హిందీ జాతీయభాషగా వుంటుందనడంలో ఎట్టి సందేహమూలేదు కాని ఒకవైపున దేశంలోని కొన్ని ప్రాంతాలలో హిందీ భాషా వివాదాన్ని లేవదీసే దృక్పథం వున్నప్పుడు హిందీ సాహిత్య వేత్తల ప్రధాన బాధ్యత ఏమిటనేదే ఇప్పుడు ప్రధాన సమస్య

"నా ఉద్దేశంలో హిందీ సాహిత్య వేత్తలంతా ఈ వివాదాలకు అతీతంగా వుండాలి తమ శక్తియుక్తు లన్నింటినీ హిందీ భాషా పరిపుష్టికి వినియోగించుకోవాలి

"ప్రస్తుత హిందీ వ్యావహారికభాషా లనుగూర్చి వచ్చిన విమర్శలన్నీ సరి కావనేది నా అభిప్రాయం అయితే హిందీ భాషను పరిపుష్టిని చేయాల్సేందుకు సాధ్యమైనంతవరకు లభ్యమైన పదాలన్నిటినీ వినియోగంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం వుంది తప్పనిసరిగా హిందీ భాషాభివృద్ధికే గాదు, భాషా సమస్యపై తలెత్తిన ఉద్రిక్తతానివారణకు, హిందీని మరింత ప్రజాభాషగా రూపొందించడానికి అవకాశం వుంటుంది.

మద్రాసు చట్టాలు

సవరించాలని ఆంధ్ర ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 5

మద్రాసు ఎస్టేట్సు రద్దుచట్టం, మద్రాసు రెంట్ రిడక్షన్ చట్టం (1947) లను సవరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది

ఈ చట్టాల నిబంధనలను, ఇటీవల వరంగల్, నల్గొండ జిల్లాలకు బదిలీ చేయబడ్డ ఆంధ్ర ప్రాంతాలకు వర్తింపజేసేందుకు అవసరమైన బిల్లులను రాష్ట్ర శాసనసభలో ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. ఇతవరకు ఈ చట్టాలు ఈ ప్రాంతాలలో అమలులో లేవు (వి వి)

◆

ఇతరుల కంటె ముఖ్యంగా యువకులే చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించ వలసిన అవసరముందని కేంద్ర మంత్రి ప్రొఫెసర్ హుమాయూన్ కబీర్ త్రివేంద్రంలో చెప్పారు

ప్రతి రాష్ట్రానికి ఒక చిన్న పరిశ్రమల కార్పొరేషన్

ఏర్పాటుపై మంత్రి ప్రకటన

పూరీ, అక్టోబరు 5

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ప్రతి రాష్ట్రంలోనూ ప్రభుత్వాధ్వర్యాన నడుస్తున్న పరిశ్రమల కేంద్రాల యాజమాన్యాన్ని పూర్తిగా తీసుకొనే ఉద్దేశంతో ఒక్కొక్క రాష్ట్రానికి ఒక్కొక్క చిన్న పరిశ్రమల కార్పొరేషన్ స్థాపించడం భారత ప్రభుత్వ విధానమని కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ మనూభాయి షా నేడిక్కడ తెలియజేశారు

అఖిలభారత చిన్న పరిశ్రమలబోర్డు 14వ సమావేశాన్ని ఆరంభిస్తూ శ్రీ షా పై విధంగా తెలిపారు ఇంకా ఇలా అన్నారు

ప్రతి రాష్ట్రానికీ ఏర్పరచబోయే యీ చిన్న పరిశ్రమల కార్పొరేషన్ ఆ రాష్ట్రంలోనున్న ప్రతి పరిశ్రమల కేంద్రానికి అవసరమయ్యే ముడిసరుకుల సౌకర్యాలను, వాటి కోసం డిపోలను, అక్కడ తయారయ్యే వస్తువుల అమ్మకపు సౌకర్యాలను, స్థానికంగా ఉత్పత్తి చేయబడే యంత్రాలకు వాయిదాలపై డబ్బు చెల్లించే పద్ధతి సౌకర్యాలను కలుగచేస్తుంది

చిన్న పరిశ్రమలంటే ఐదు లక్షల పెట్టుబడికి మించకుండా వుండేవి ఇందులో భూమి, భవనాలు, యంత్రాలు అన్నీ చేరతాయి కాని ఎంతమంది కార్మికులున్నారన్న సంగతి పరిగణించబడదు. ఇదివరకు యీ చిన్న తరహా పరిశ్రమలకు సహాయం పడే వివిధ సంస్థలు అన్ని విధాల తగినంత బలంగా లేనందువల్ల ప్రతి పరిశ్రమలోను ఎందరు కార్మికులున్నారనే విషయం పరిగణించవలసివచ్చింది కాని ఇప్పుడు అలాంటి పరిస్థితిలేదు ఈ కృషిలో సహాయపడే సంస్థలన్నీ నిలద్రొక్కుకున్నాయి గనుక ఇప్పుడు కార్మికుల సంఖ్య ఎంత అన్న విషయాన్ని పరిగణించవలసిరాదు" అన్నారు

దేశంలో చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అనేకరకాల పెట్టుబడి సౌకర్యాలను గురించి మంత్రి వివరించారు

అందులో ఒకటి రిజర్వుబ్యాంకు ఆధ్వర్యాన నడిచే పెట్టుబడిగ్యారంటీ పథకం మొదట్లో దీనిని 42 జిల్లాల్లో అమలుజరపుతారు 1960 జనవరి 1వ తేదీనుంచి ఆరంభమవుతుంది

ఇందు నిమిత్తం చిన్నపరిశ్రమలకు అప్పుగా ఇవ్వాలని 25 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు

వేతన సంఘ సూచనలు

యు పి లో 18 పత్రికా సంస్థలచే అమలు

కాన్పూర్, అక్టోబరు 5.

ఉత్తరప్రదేశ్‌లోని18వార్తాపత్రికల సంస్థలు పాత్రికేయుల వేతనాలసంఘం సిఫార్సులను పూర్తిగా అమలు జరిపాయని, ఒక సంస్థ మాత్రం పాక్షికంగా అమలు జరిపిందని, రాష్ట్ర ప్రభుత్వ లేబర్ కమిషనర్ శ్రీ ఉమాశంకర్ నేడు పత్రికల వారికి తెలియజేశారు

బెంగాలు ఆహార పరిస్థితిపై శ్రీపాటిల్

కలకత్తా, అక్టోబరు 6

ఎప్పటికప్పుడు ఆహార పరిస్థితిని సమీక్షించడానికి, ఆహార పదార్థాల ధరలను అటు వ్యవసాయదార్లకూ, ఇటు వినియోగదార్లకుకూడా కలిసివచ్చే విధంగా నిర్ణయించడానికి ఒక శాశ్వత సంఘాన్ని నియమించాలనే ప్రతిపాదన వున్నదని కేంద్ర ఆహారమంత్రి శ్రీ ఎస్ కె పాటిల్ నేడిక్కడ తెలిపారు

ఈ విషయాన్ని భారత వాణిజ్య సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతూ చెప్పారు

నేడే శ్రీ పాటిల్ ఢిల్లీనుంచి ఇక్కడకు వచ్చారు రాష్ట్రముఖ్య మంత్రితో బెంగాల్లో ఆహార, ధరల పరిస్థితుల గురించి మాట్లాడారు సంభాషణలో రాష్ట్రఆహారమంత్రి కూడ పాల్గొన్నారు

కాంగ్రెస్ మహాసభ

బెంగుళూరు, అక్టోబరు 5

భారత జాతీయ కాంగ్రెస్ 65వ సమావేశం బెంగుళూరులో జరుగనున్నది

కేరళ ఎన్నికల ఒప్పందాన్నిగురించి కమ్యూనిస్టేతర పార్టీలతో సంప్రతించడానికి రివల్యూషనరీ సోషలిస్టుపార్టీ ముగ్గురితో ఒకకమిటీని నియమించింది

◆ ◆ ◆

కేరళ ఎన్నికలలో ముస్లింలీగ్‌కు కేటాయించిన పన్నెండు స్థానాలలో ఎనిమిది కోజికోడ్ జిల్లాలో వుంటాయని లీగ్ వర్గాలవారు అన్నారు

నిజామాబాద్‌లో నిరశన వ్రతం

చౌక డిపోల స్థాపనకై

నిజామాబాద్, అక్టోబరు 5

చౌక డిపోలు తెరవవలసిందిగా కోరుతూ శ్రీ ఐ. ఠల్ దాసుగారు ఇక్కడ నిరాహారదీక్ష బూని నేటికి ఎనిమిది రోజులయింది. వారు చాలా బలహీన పడిపోయారు. నాడి వేగం తగ్గింది. అయినా ప్రభుత్వం నోరు మెదపకుండా కూర్చుంది. పట్టణ ప్రజానీకంలో అలజడి ప్రారంభమైంది.

చౌక డిపోల ఏర్పాటుకై మున్సిపాలిటీనుండి కొంత సైకాన్ని కేటాయించవలెనని కొంతమంది మున్సిపల్ కౌన్సిలర్లు ప్రయత్నం చేస్తున్నారు.

ప్రభుత్వంమాత్రం లక్ష్యం చేసుకోకుండుట అందరూ నిరసిస్తున్నారు. (వి వి)

రేడియో

గురువారం, అక్టోబరు 8

విజయవాడ

ఉదయం 6-30 సుప్రభాతం 6-40 భక్తిరంజని 7 0 వార్తా, 7-15 నాదస్వరం, 7 45 సంగీతశిక్షణ 8-0 ఇంగ్లీషు వార్తా 8 15 హిందీ వార్తా మధ్యాహ్నం 12-30 కార్మికులకు, 1 0 అధికార్ల నరసింగరావు 1-30 కర్పూరమంజరి, సీరియల్ నాటిక (రెండవభాగము) కీ. శే. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి నవలకు రేడియో అనుసరణ 'అమరేంద్ర' 1 50 వార్తా 8 30 వీణ 8 45 టీచర్లకు (ఇంగ్లీషు) సాయంత్రం 6 0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాంతీయ వార్తా, 6-15 గ్రామస్థులకు 7-0 వార్తా 7-15 గ్రామస్థులకు: నిమిషం కథ ఉంటుందా? (ప్రసంగం) 7 45 రాగం, తానం, పల్లవి 8 30 రేడియో న్యూస్ రీల్ 8 40 అధికార్ల నరసింగరావు 9 0 ఇంగ్లీషు వార్తా 9-15 ఫిల్మ్ సంగీత 9 30 అఖిలభారత రూపక కార్యక్రమము 'మాచ్‌ఖండ్ హైడ్రో ఎలెక్ట్రిక్ ప్రాజెక్టు, రచన వి. నరసింహశాస్త్రి, 'అమరేంద్ర' 10 0 నాదస్వరం 10 30 సమాప్తి

హైదరాబాద్ - (బి)

ఉదయం: 6 30 సుప్రభాత్ మధ్యాహ్నం 12-30 కార్మికులకు; 1 0 కె. రాజలక్ష్మి, 1 30 విజయవాడవలె 2-0 వేణువు సాయంత్రం 6 0 స్థానిక ప్రకటనలు 6 15 గ్రామస్థులకు 7 0 వార్తా 7-15 గ్రామస్థులకు 7-30 ప్రసంగం 9-15 జిలెట్ సంగీత్ 9 30 అఖిలభారత రూపక కార్యక్రమము, 10 30 సమాప్తి

బజారు ధరలు

విజయవాడ, అక్టోబరు 6

[మధ్యాహ్నం గం 1 వరకు]

బంగారం ధరలు

తులము: పాత్లు	122 8 0
మెరుగు	122 0 0
నగలకు	80 0 0
వెండి 100 తులములు	201 8 0
తులము	2 1 0

ధాన్యం ధరలు

24 నెంబరు	రు 32 0 0
సంకరన్నాలు	29 8 0
12 నెంబరు	28 0 0
అక్కుళ్ళు	27 8 0
మసూరు	27 0 0

బియ్యం ధరలు

24 నెంబరు	రు 75 0 0
సంకరన్నాలు	71 0 0
12 నెంబరు	67 0 0
అక్కుళ్ళు	65 0 0
మసూరు	63 0 0

అపరాల ధరలు

మినుములు 240సేర్లు		55 0 0
కందులు		49/50 0 0
పల్లపెసలు(మూగాలి)		49/50 0 0
పచ్చపెసలు 280 సేర్లు		48 0 0
పచ్చపెసలు(పొట్టు)		49 0 0
సెనగలు (వేర్లాతి)		46 0 0
సెనగలు (పంజాబ్)		37 8 0
ధనియాలు 25కుంచాలు		55 0 0
ఉలవలు		39/42 0 0
ఆముదాలు		45 8 0
పంచదార (వుయ్యూరు)		118 0 0
కొబ్బరి నూనెడబ్బా		39 12 0
వెల్లుల్లి మణుగు	9/-	10 4 0
బెల్లం ,,	6 0-0	8 0 0
మిర్చి ,,	24 0-0	30 0 0
నీరుల్లి	3 6 0	2-18 0
చింతపండు,,	11-0-0	18 0 0
నువ్వులనూనె ,,		36 00
వేరుశనగపప్పు 177 సేర్లు		
జగ్గయ్యపేట		65 0 0
కోదాడ		66 0 0
నూనె మణుగు		18 8 0
కేక్ 160 సేరులు		25 4 0
కొబ్బరికాయలు 1000 సాతవి		258/ 225
సంచులు 100		93 8 0
జీటా ఫార్వర్డు		92 8 0
తవుడు 2 వట్టు		11 0 0
,, 3 ,,		12 8 0

విద్యార్థి ఫెడరేషన్ కార్యవర్గసమావేశం

విశ్వ విద్యాలయాధికారుల వద్దకు రాయబారం పంప నిర్ణయం

గుంటూరు, అక్టోబరు 5

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం గుంటూరులో శ్రీ కొల్లి నాగేశ్వరరావుగారి అధ్యక్షతను నిన్న జరిగింది.

అనేక కళాశాలల్లో ఫెడరేషన్ ఆధ్వర్యాన విద్యార్థి యూనియన్‌లు ఏర్పడటానికి కృషిచేసిన కార్యకర్తలను, విద్యార్థులను అభినందనలు తెలియజేశారు. ఈ యూనియన్‌ల ద్వారా విద్యార్థులను జాతీయాభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేటట్లు కృషి చేయాలని నిర్ణయించారు.

అక్టోబరు 20వ తేదీ లోగా విద్యార్థి సమస్యల పత్రాలపై సంతకాల సేకరణను పూర్తిచేసి "ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ ఆఫీసు, బ్రాడీపేట 4వ లైను, గుంటూరు"కు పంపాలని కార్యకర్తలను కోరుతూ తీర్మానించారు. ఈ సంతకాలతో ఆంధ్ర విశ్వ విద్యాలయాధికారుల వద్దకు రాయబారం పెళ్ళాలని తీర్మానించారు. మరియు నవంబరులో మహాసభ జరపాలనికూడా నిర్ణయించారు.

వచ్చే విద్యా సంవత్సరము నుండి ప్రదేశ్‌లోని మూడు విశ్వ విద్యాలయాలలోను ఒకే సిలబస్‌తో కోర్సులు ప్రారంభించాలని, విజయవాడలో బాలికల కళాశాలను స్థాపించాలనీ, చైనా-భారత సరిహద్దు వివాదాన్ని శాంతియుత సంప్రదింపులద్వారా పరిష్కరించుకోవాలనీ మరికొన్ని తీర్మానాలు చేశారు.

సింహళ ప్రధాని మరణానికి సంతాపం తెలుపుతూ తీర్మానించారు.

ప్రైవేటు విద్యుచ్ఛక్తి పనివారికి ఒకే లైసెన్సు పద్ధతి

అమలు జరపాలని తీర్మానం

విజయవాడ, అక్టోబరు 30

విజయవాడ ప్రయివేటు ఎలెక్ట్రికల్ వర్కర్సు అసోసియేషన్ కమిటీ సమావేశం శ్రీ బి. దుర్గారావుగారి అధ్యక్షతను మొన్న జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర అసోసియేషన్ల రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వారితో సంప్రదించుటకు ఒక ప్రతినిధివర్గాన్ని పంపాలని, ఆయా అసోసియేషన్లు త్వరగా రిజిస్ట్రేషనులను పూర్తిచేయాలని తీర్మానించారు.

ప్రయివేటు విద్యుచ్ఛక్తి పనివారికి ఒకే లైసెన్సు విధానము రాష్ట్ర మంతటా అమలుపరచవలెనని ప్రభుత్వాన్ని కోరుతూ మరొక తీర్మానం చేశారు.

ఈ సభకు తణుకు, ఏలూరు, గుంటూరు, బందరు ఇతర ప్రదేశముల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

సీతన్నపేట యువజన సంఘ సమావేశం

విజయవాడ, అక్టోబరు 1

విజయవాడ సీతన్నపేట యువజన సంఘ సర్వసభ్య సమావేశం పొట్టి శ్రీరాములు గ్రంథాలయంలో శ్రీ కారెపు అప్పలస్వామిగారి అధ్యక్షతను జరిగింది.

కార్యదర్శి నివేదిక, జమా ఖర్చులు ఏకగ్రీవంగా ఆమోదించిన తర్వాత నూతన సంవత్సరమునకు ఈ క్రింది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

శ్రీ ఆత్తి వెంకటేశ్వరరావు అధ్యక్షులు, శ్రీ మండల దుర్గారావు కార్యదర్శి, శ్రీ కనకల చిన్న అప్పలస్వామి కోశాధికారి, ఐదుగురు సభ్యులు.

గత సంవత్సరం ఏర్పడిన లోటు భర్తీ చేయుటకు కార్యదర్శి విరాళాలకై విజ్ఞప్తిచేయగా సమావేశంలో రు 45 50 న పైసలు వాగ్దానాలు వచ్చాయి.

హిందీ ప్రచార వారోత్సవాల ప్రారంభం

హైదరాబాదు, అక్టోబరు 4

దక్షిణ భారత హిందీ ప్రచారసభ (ఆంధ్ర) ఆధ్వర్యమున నడుపబడుతూ ఉన్న హిందీ ప్రచార వారోత్సవాలు ఇక్కడ వై యం సి ఏ హాలులో ప్రారంభమైనవి. స్వామీ రామానందతీర్థ అధ్యక్షత వహించారు.

శాసనసభాధ్యక్షులు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారు ఉత్సవాలను ప్రారంభించారు. ప్రచారసభ కార్యదర్శి శ్రీ వేమూరి ఆంజనేయశర్మగారు మహాత్మా గాంధీ జయంతి సందర్భంలో ప్రతి సంవత్సరం ఇదేవిధంగా హిందీ ఉత్సవాలు జరుగుతూ ఉన్నవని వివరించారు.

తర్వాత శ్రీ దాశరథి, శ్రీ మాన్వి నరసింగరావు, దక్షిణభారత హిందీ ప్రచారసభ (మద్రాసు) సంయుక్త కార్యదర్శి శ్రీ ఉన్నవ రాజగోపాల కృష్ణయ్యగార్లు కూడా ప్రసంగించారు.

శ్రీ ఆర్ ఎం జోషి గారు ధన్యవాదా లర్పించారు.

రాజమహేంద్రవరం పౌరులకు కృతజ్ఞత

పౌరసమితి సభ్యుల ప్రకటన

రాజమహేంద్రవర, అక్టోబరు 3

మునిసిపల్ ఎన్నికల్లో పట్టణ అభివృద్ధి అనే పరమాశయంతో ఏర్పడిన పౌరసమితి అభ్యర్థులను మొత్తము 36 స్థానాల్లో (సమితి బలపరచిన స్వతంత్ర అభ్యర్థితో సహా) 21 స్థానాల్లో గెలిపించిన రాజమహేంద్రవరం పౌరులకు కృతజ్ఞత తెలుపుతూ ఈ సభ్యులందరూ నేడొక ప్రకటన చేశారు.

మునిసిపల్ ఎన్నికలకు ముందు ఏ ప్రణాళిక, కార్యక్రమాల నయితే ప్రజలముందు ఉంచామో వాటికి కట్టుబడి పని చేయగలమనీ, పౌర సమితి పార్టీ రాజకీయములకు పాక్షిక వైఖరులకు తావివ్వకుండా పట్టణాభివృద్ధికి కృషిచేస్తుందని వారా ప్రకటనలో హామీ యిచ్చారు.

అలాగే పౌరసమితి కార్యకలాపాలపట్ల ఆదరాభిమానాలను చూపి అన్నివిధాల సహకరించాలనీ, ఎన్నికలు ముగిశాయి కనుక పార్టీ విభేదాలను మాని అందరుకలసి పట్టణాభివృద్ధికి తోడ్పడవలసిందిగా అందరికీ విజ్ఞప్తి చేశారు.

ఆంధ్ర విశ్వ విద్యాలయ ఉద్యోగుల సంఘవార్షికోత్సవం

విశాఖపట్నం, అక్టోబరు 3

ఆంధ్ర విశ్వ విద్యాలయ ఉద్యోగుల సంఘ ద్వితీయ వార్షికోత్సవం ఇక్కడ సెప్టెంబరు 27 న మున్సిపల్ స్టేడియంలో జరిగింది. సంఘాధ్యక్షులు శ్రీ యం. వి. భద్రయ్యగారధ్యక్షత వహించారు. సాయంత్రం బహిరంగ సభకూడా అక్కడే జరిగింది.

పార్లమెంటు సభ్యులు, అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శులలో ఒకరు అయిన డాక్టర్ రాజ్ బహదూర్ గౌడ్ ఉపన్యసిస్తూ ఉద్యోగులు పౌరులుగా రాజకీయ హక్కులను, ఉద్యోగులుగా ఆర్థిక కోర్కెల్ని సాధించుకోవాలనీ, అందుకు ఉద్యోగుల ఐక్యత, నిర్మాణ దీక్ష అవసరమన్నారు.

స్వాతంత్ర్య సముపార్జన తర్వాత విశేషించి పెరిగిందనీ, జీతాలు పడిపోయి వస్తువుల ధరలు పెరిగాయని వివరిస్తూ దేశంలోని ప్రతిఘాతక శక్తులు స్వతంత్రపార్టీ పేర సమీకృతమై సోషలిస్టు సమాజ నిర్మాణం అనే లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నారనీ, కార్మిక సంఘాలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు.

త్వరలోనే యూనివర్సిటీవారు సంఘాన్ని గుర్తిస్తారని ఆశాభావం ప్రకటించారు.

సంఘ కార్యదర్శి శ్రీ వై. బ్రహ్మలింగస్వామిగారు కార్యదర్శి నివేదికను, కోశాధికారి శ్రీ కె. లక్ష్మణరావుగారు జమాఖర్చులను చదివి వినిపించారు.

కళాకారులకు ప్రజా సమస్యల సంబంధం' వుండాలని తమిళనటుడు బాలచంద్రన్ విజ్ఞప్తి

ఏకాంబరకుప్పం, అక్టోబరు 1

"కళా కార్యక్రమాల వల్ల ప్రజలు రాజకీయ చైతన్యాన్ని పొందటం కాంగ్రెసువారికి భీతి గొల్పుచున్నది. అందుకే శ్రీ కామరాజనాడార్ ప్రభృతులు కళాకారులు రాజకీయాలలో పాల్గొనరాదంటున్నారు. కళాకారులు ప్రజల మనస్సును రంజింపజేసి డబ్బు సంపాదించడమేగాక, వారిసమస్యలను అర్థంచేసుకొని వాటి పరిష్కారమునకై కృషి సల్పుటకూడా కర్తవ్యముగా గుర్తించాలి. కమ్యూనిస్టు పార్టీతో సంబంధముగల కళాకారులకూ, యితరులకూ యిదే తేడా' అని ప్రసిద్ధ తమిళ సినిమా నటుడు శ్రీ టి. కె. బాలచంద్రన్ చిత్తూరు జిల్లా సారకాయలపేటలో పట్టణ కమ్యూనిస్టు శాఖ ఆధ్వర్యాన జరిగిన బహిరంగ సభలో అన్నారు. శ్రీ బి. వెంకట్రామారెడ్డి అధ్యక్షత వహించారు. మూడు వేల మంది ప్రజలు సభకు వచ్చారు.

అనంతరం రాజంపేట హుస్సేన్ దళంవారు బుర్రకథ చెప్పారు.

సభలు సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద మహామండలి సర్వసభ్య సమావేశము విజయవాడలో ఈ నెల 12న సాయంత్రం 4 గంటలకు జరుగుతుంది.

* * *

రామచంద్రపురం తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశము ఈ నెల 12 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మండపేటలో వాణీ మహల్ వద్ద జరుగును.

* * *

గుంటూరుజిల్లా రైతుసంఘ కార్యవర్గసమావేశము అక్టోబరు 10 వ తేదీ ఉదయం 8 గంటలనుండి బాపట్ల తాలూకా స్వర్ణలో జరుగుతుంది.

విజయనగరం మునిసిపల్ ఎన్నికల ఫలితాలు

విజయనగరం, అక్టోబరు 5

విశాఖజిల్లా విజయనగరం మునిసిపాలిటీకి ఈ క్రిందివారు గెలుపొందినట్లు ప్రకటించబడింది.

శ్రీయుతులు రత్నస్వామిపిళ్ళై, పద్దిల కృష్ణ (క) జెత్తా శ్రీరామమూర్తి, కడగం రామమూర్తి, పిల్లి అప్పలస్వామి నాయుడు, కొణతాల అప్పారావు, నారాయణం సీతారామయ్య శెట్టి, జి. సుందరరావు, యెడ్ల సూర్యప్పారావు, శిగిరెడ్డి సాంబశివరావు, చింతపల్లి నారాయణ, పొట్నూరు గురువులు, (క) మద్దిల చిన్న, బొట్ట అప్పలస్వామి, లండ రాములు, శ్రీమతి నమ్మి బంగారమ్మ (స్త్రీ క ఈమె లాటరీలో ఎన్నికైంది) బొడ్డుమద్దుకృష్ణ (పోటీలేదు), అప్పసాని అప్పన్నదొర, (ప్రస్తుత చైర్మన్, యం యల్ సి, పోటీలేదు) అసద్ అలీఖాన్, వరాలశెట్టి ప్రకాశరావు, గోటెంకట్రావు(క), గుంటాల బదిరీనారాయణ, డా॥ బి ఏ సంజీవరావు (పోటీలేదు), పన్నాల గోపాలం (పోటీలేదు), కట్నాల లింగమూర్తి, మధుసూదన సూర్యనారాయణరాజు, బుర్రా వెంకటేశ్వరరావు, యనమండ్ర నారాయణమూర్తి, కాశా దేవకీనందనరావు, చింతపల్లి అప్పలనరసయ్య, శ్రీమతి లింగం సీతాదేవి (స్త్రీ క) ప్రసాదుల ఆదినారాయణగార్లు.

పంచాయతీ ఎన్నికలు

ఆరుగొలను, అక్టోబరు 6

కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా ఆరుగొలను గ్రామపంచాయతీకి ఈ దిగువవారు సభ్యులుగా ఎన్నికైనారు.

శ్రీయుతులు మాలెల్వారి రామయ్య, వెంకాయ చలమయ్య, వీరబ్రహ్మయ్య, పసుపులేటి నారాయణస్వామి, వేంసి పోచలం, రెడ్డి అప్పలస్వామి, గోగులమూడి రాజరత్నంగారు.

మహిళా సభ్యురాలిగా శ్రీమతి వడ్లమూడి నారాయణమ్మ అధ్యక్షులుగా శ్రీ మాలెల్వారి రామయ్య (కమ్యూ) ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

రేపాళ్ళ

హుజూరునగరు తాలూకా (మునగాల పరగణా) రేపాల పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెసు అన్ని సీట్లలో ఓడిపోయింది. కమ్యూనిస్టుపార్టీకి 6 సీట్లు, గ్రామ వెలుగు సమాజానికి 4 సీట్లు వచ్చాయి.

శ్రీయుతులు కుంకరి లక్ష్మినరసయ్య, కుంకరి వెంకటనరసయ్య, కొల్లు లచ్చయ్య, జూలకంటి వెంకటాద్రి, ముడిరెడ్డి రంగారెడ్డి, పోకల సంగు నరసయ్య (క), వేదం కృష్ణమూర్తి, జె. మంగయ్యగార్లు.

బాపులపాడు

కృష్ణాజిల్లా బాపులపాడు గ్రామ పంచాయతీకి ఈదిగువ సభ్యులు ఎన్నికయ్యారు.

శ్రీయుతులు వేదేపూడి సుబ్బారావు, గూడవల్లి గోపాలకృష్ణయ్య, కుల్లిమల్లి సత్యం(క), పున్నాటి సత్యనారాయణ, మహమ్మద్ హుస్సేన్ సాహెబ్, అడపా పట్టాభిరామారావు, ఈమని వెంకయ్యగార్లు (ఏకగ్రీవం)

సత్యవరం

విశాఖపట్నం జిల్లా యలమంచిలి తాలూకా సత్యవరం పంచాయతీ అధ్యక్షులుగా జిల్లా కమ్యూనిస్టు సమితి సభ్యులు శ్రీ గోళ్ళ నారాయణరావు గారు మహిళా సభ్యురాలుగా శ్రీమతి గోళ్ళ వరహాలమ్మగార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దామరమడుగు

నెల్లూరుజిల్లా కోవూరు తాలూకా దామరమడుగు పంచాయతీకి ఈ క్రింది వారు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

శ్రీయుతులు బక్కా వెంకయ్య, కె. చంద్రమోహన్, సోమరెడ్డి సుబ్బారెడ్డి, యం. గౌసుభాషా, సోమారెడ్డి వి. వరెడ్డి, మొండెం దశరథరామిరెడ్డి, పాలిచర్ల శీతారామిరెడ్డి, చింతా చిన సుబ్బయ్యగార్లు

రామలింగవరం

పశ్చిమ గోదావరిజిల్లా రామలింగవరం పంచాయతీకి శ్రీయుతులు గడ్డమ బాలస్వామి (ప్రెసిడెంటు), పెద్దిశెట్టి సోమేశ్వరరావు, కామానుజం నాగయ్య, గోపిశెట్టి రామారావు, బుద్దాల కోదండాద్రి, బొల్లా శల్లయ్య, శ్రీమతి మేళ్లపల్లి వరాలమ్మ, మాళ్ళపూడి సోమయ్యగార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కేశనకుర్రు

తూర్పు గోదావరి జిల్లా కేశనకుర్రు మేజరు పంచాయతీ ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ, రిపబ్లికన్ పార్టీ, కాంగ్రెసులోని ఒక ముఠావారు కలసి ఐక్యఫ్రంటుగా పోటీచేశారు. అధికార కాంగ్రెసు 9 స్థానాలకు పోటీచేసి 1 మాత్రం గెల్చింది. ఐక్యసంఘటనకు 8 సీట్లు వచ్చాయి.

శ్రీయుతులు వుందుర్తి సుబ్బారావు (రి ఐ), కాశా సూరన్న (ఐ), పన్నమరాజు సత్యనారాయణరాజు, (కాం), కమిడి సత్యం (ఐ), గుత్తుల వెంటయ్య (ఐ), సాదిరాజు రామరాజు (ఐ), పట్టా సూర్యనారాయణ (ఐ), యిందుకూరి సూరపరాజు(మాజీ ప్రెసిడెంటు- ఐ), బందన నాగిరాజు (ఐ) గార్లు

యీదరపల్లి

అమలాపురం తాలూకా యీదరపల్లి పంచాయతీకి శ్రీయుతులు మోరం వెంకటరత్నం, అడపా పట్టాభిరామయ్య, పరచా పోలయ్య, మోపూరి మాణిక్యం, పెనుమాల సుబ్బరావు, బొంతు సుబ్బన్న, కడింపోలయ్యగార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బోగోలు

నెల్లూరిజిల్లా కావలి తాలూకా బోగోలు పంచాయతీకి శ్రీయుతులు వై. సుందరమూర్తి, మహమ్మద్ ఖాసిం, సాంతిపూడి పెంచలయ్య, వై. జి. శ్రీరాములురాజు, షేక్ హుస్సేన్, అక్కరాజు వెంకటకృష్ణయ్య, యన్నాబత్తిని బలరామయ్య, కంచర్ల వెంకటనారాయుడు, యం. శంకరయ్య, ఇనగంటి వెంకటసుబ్బయ్య, మద్దిబోయిన రమణయ్య, ఆవుల వెంకటసుబ్బయ్య, గుర్రాల సుబ్బరాయుడుగార్లు ఎన్నికయ్యారు.

రైల్వే ప్రాంతంలో పోటీచేసిన స్థానిక రైల్వే నాయకుడు శ్రీ వై. సుందరమూర్తిగారికి పోలైన 586 ఓట్లలో 584 వచ్చాయి.

వేలంక

తూర్పు గోదావరిజిల్లా వేలంక పంచాయతీకి గండే కామేశ్వరరావు గారు అధ్యక్షులుగా ఎన్నికైనారు.

సామర్లకోటలో చేనేత పాఠశాల

నవంబరు 2 నుండి నాలుగు రోజులు

ఉప్పాడ, అక్టోబరు 6

ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘ నాయకులు శ్రీ పుక్కళ్ల సత్యనారాయణ యం ఎల్ ఏ గారు క్రింది ప్రకటన చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘం తరఫున తూర్పు గోదావరిజిల్లా సామర్లకోటలో "చేనేత పాఠశాల" నాలుగు రోజులు నడుపబడును.

పాఠశాల నవంబరు రెండవ తేదీన ఉదయం ప్రారంభమై నవంబరు 5వ తేదీ రాత్రితో పూర్తిఅగును.

ప్రస్తుతం 30 మంది విద్యార్థులకని నిర్ణయించబడింది. సామర్లకోట పట్టణ చేనేత సంఘంవారు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు రాకపోకల ఖర్చులు, కాఫీ ఖర్చులు ఎవరివి వారే భరించవలెను. ఒక్కొక్క భోజనానికి 0 4 0 చొప్పున విద్యార్థివద్ద తీసుకుని మిగతాది పట్టణ చేనేత సంఘంవారు భరించి హోటలులో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈనెల 20 వ తేదీలోగా దరఖాస్తులు "శ్రీ పుక్కళ్ల సత్యనారాయణ (యం ఎల్ ఏ), ఉప్పాడ, తూర్పు గోదావరిజిల్లా" అను అడ్రసుకు పంపవలెను.

పాలకొల్లు రూరల్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ చర్యలు

పాలకొల్లు, అక్టోబరు 4

నర్సాపురం తాలూకా కాపవరం మునసబు స్థానిక పంచాయతీ యెన్నికల్లో ఒకపక్షం వహించి పనిచేస్తూ, రెండవపక్షం వారిపై పోలీసు స్టేషనుకు తనపై దౌర్జన్యం సాగించబోతున్నారంటూ రిపోర్టు పంపించారు. దీనిపై పాలకొల్లు రూరల్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ (రైటరు) మొన్న కాపవరం (పాలమూరు) వెళ్లి మునసబుతో మంతనాలాడి, గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షులు, మాజీ మునసబు, గ్రామ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శి, త్రైపురి అధ్యక్షులు మొదలగు గౌరవనీయులైన రైతులను పోలీసు స్టేషనుకు పిలిపించారు.

వీరందరు నిన్న తాలూకా కమ్యూనిస్టు నాయకులు శ్రీ భూపతిరాజు లక్ష్మీనరసరాజు, శ్రీ అల్లూరి సత్యనారాయణగార్లతో సబ్ యిన్‌స్పెక్టరు గారిని కలుసుకొన్నారు. మునసబు తప్పుడు రిపోర్టుల ఆధారంగా రైటరు చేస్తున్న అక్రమ, దుందుడుకు చర్యలను వారికి వివరించారు. సబ్‌ఇన్‌స్పెక్టరు వారితో స్టేట్‌మెంటులు తీసుకొని పంపించారు. (వి వి)

కమ్యూనిస్టుపార్టీ నుండి తొలగింపు

పాలకొల్లు, అక్టోబరు 3

నర్సాపురం తాలూకా జిన్నూరు గ్రామ కమ్యూనిస్టుశాఖ ఇందుకూరి సూరపరాజు, కందమూరి సుబ్బారావు గార్లను ఆర్థిక దుర్వినియోగ, పార్టీ వ్యతిరేక చర్యలవల్ల పార్టీనుండి తొలగించింది.

మోటూరు సమాజ వికాస కేంద్రం వారు మోటూరులో సెప్టెంబరు 28, 29, 30 తేదీలలో గ్రామ సహాయకుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు.

లాటరీ తీయడంలో పంచాయతీ ఆఫీసరు అక్రమం

నరసాయపాలెం, అక్టోబరు 3

బాపట్ల తాలూకా నరసాయపాలెం పంచాయతీకి శ్రీ అభ్యర్థిని ఎన్నిక అక్టోబరు 1వ తేదీన జరిగి ఇక్కడ కమ్యూనిస్టులకు 4 సీట్లు, కాంగ్రెసుకు 4 సీట్లు వచ్చాయి. ఎన్నికైన మరుసటిరోజు నుండి ఎట్టి పరిస్థితులలోను స్త్రీ స్థానం మాకే వస్తుందని భూస్వాములు బహిరంగంగా చెప్పుకోసాగారు.

దీనితో గ్రామ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి, జిల్లా పంచాయతీ ఆఫీసరు గారికి ఎడీవను పెట్టుకొని సక్రమంగా లాటరీ జరుగునట్లు చూడమనికోరారు.

ఎన్నిక రోజున ఆఫీసులోనికి సభ్యులను మినహా ఎవరినీ లోనికి రానీయవని పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పంచాయతీ ఆఫీసరు రెండు చీట్లను సమంగా మడవక ఒకటి చిన్నదిగా, మరొకటి పెద్దదిగా మడిచి డబ్బాలో వేయబోగా కమ్యూనిస్టు సభ్యులు ఆక్షేపణ తెలిపి సమానసైజులో మడవమన్నారు. కాని ఆఫీసరు వినిపించుకోకనే తనకు గుర్తుగా వుంచుకొన్న చీటి తీసి కాంగ్రెసు అభ్యర్థిని గెలిచినట్లు ప్రకటించి వెళ్ళిపోయారు.

ఆ రోజే ఐ జి యల్ బి గారికి యీ అన్యాయాన్ని విచారించవలసిందిగా కమ్యూనిస్టు సభ్యులు టెలిగ్రాం కూడా యిచ్చారు.

గుత్తి తాలూకాలో తక్కావీ పెండింగు అర్జీలు

అదనపు మొత్తం మంజూరు చేసి అప్పులివ్వాలని అభ్యర్థన

గుత్తి, అక్టోబరు 3

రెవిన్యూబోర్డు సభ్యులు శ్రీ యం. టి. రాజు, అనంతపురం జిల్లా కలెక్టరు గార్లు యిక్కడకు వచ్చిన సందర్భంలో వారికి గుత్తి తాలూకా రైతుసంఘం అధ్యక్షులు శ్రీ బి. సుబ్బప్ప, శ్రీ కానా లక్ష్మన్న గార్లు ఒక మెమోరాండం సమర్పించారు.

గత సంవత్సరం తాలూకాలో పంటలు పండనందున శిస్తు రెమిషన్ యిచ్చారనీ, కేవలం పశువులనే రైతులమ్ముకున్నారనీ, కాబట్టి ఇంకా తాలూకా ఆఫీసులో పెండింగులో వున్న తక్కావీ అప్పు దరఖాస్తులను మంజూరు చేయించాలని మెమోరాండంలో కోరారు.

ఆలోచించిన తర్వాత తగిన సహాయం చేస్తామని రెవిన్యూ బోర్డు సభ్యులు అన్నారు.

జోహార్లు

రాజమండ్రి, అక్టోబరు 4

రాజమండ్రి కృష్ణారావుపేట కమ్యూనిస్టు పార్టీ శాఖ కార్యదర్శి శ్రీ కొట్టా లక్ష్మణస్వామిభార్య శ్రీమతి రాజమ్మ జ్వరంతో సెప్టెంబరు 29వ తేదీన బలభద్రపురం గ్రామంలో కాలధర్మంచెందారు. ఆమెకు జోహార్లు అర్పిస్తూ కృష్ణారావుపేట కమ్యూనిస్టు శాఖ తీర్మానించింది.

పులి దెబ్బకు ఒకరి మరణం

ఏలేశ్వరం, అక్టోబరు 3

తూర్పుగోదావరిజిల్లా ఎల్లవరం తాలూకా చవిటిదిబ్బలు అనే గ్రామంలో సెప్టెంబరు 27 న సాయంత్రం తన యింటివద్దనున్న జర్తా చిన్నయ్య మీద పెద్దపులిపడి చంపివేసింది. విడెంల చిన్నయ్య మీద పడి పంజాతో కొట్టింది. పులివలన ప్రజలు భీతిచెందుతున్నారు.

బొబ్బిలి తాలూకా మహిళా సమాజం

బొబ్బిలి, అక్టోబరు 4

శ్రీకాకుళంజిల్లా బొబ్బిలి తాలూకా మహిళా సమాజం సభ్యురాండ్ర సర్వసభ్య సమావేశం అక్టోబరు 2 న పిరిడిలో జరిగింది. ఈ క్రిందివారితో ఒక కార్యవర్గమును ఎన్నుకొన్నారు.

శ్రీయుతులు పి. శకుంతలాదేవి (అధ్యక్షురాలు), జగనసావిత్రిదేవి (ఉపాధ్యక్షురాలు), కె. సీతాదేవి (కార్యదర్శిని) చంద్రోదయమ్మ (సహాయ కార్యదర్శిని), రాజ్యలక్ష్మి (కోశాధికారిణి), సభ్యురాండ్రు జె. మహాలక్ష్మి, పి. అప్పలనరసమ్మ, యస్. ఇందిరాదేవి, కె. సురిమమ్మ గార్లు

సమాజాన్ని రిజిష్టరు చేయించాలని తీర్మానించారు.

మొగిలిచర్ల

నెల్లూరుజిల్లా కందుకూరు తాలూకా మొగిలిచర్ల గ్రామ రైతుసంఘ సమావేశం శ్రీ గుడిపాటి బ్రహ్మయ్య అధ్యక్షతను సెప్టెంబరు 29 వ జరిగింది.

శ్రీ పెన్నా ఎచ్చయ్యగారిని అధ్యక్షునిగా, శ్రీ పల్లపోతు నాగయ్య గారిని ఉపాధ్యక్షులుగా, శ్రీ బి. రమణయ్యగారిని కార్యదర్శిగా మరొక ఆరుగురు సభ్యులుగల ఒక కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

లేఖలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ ఉదాసీనం

ఆర్యా,

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు అతి ముఖ్యమైన ప్రాజెక్టులలో ఒకటి. కాని ఈ ప్రాజెక్టును త్వరలో అనుకున్న విధంగా పూర్తి చేయుటకు కేంద్ర ప్రభుత్వం పూనుకొనుటలేదు. ఇంతవరకు ప్రాజెక్టు రెండవదశను అది ఆమోదించనే లేదు. ఆమోదించిన మొదటి దశ కూడా సకాలములో పూర్తి అగుటకు తోడ్పడుట లేదు.

అసలు మొదటిదశకు పెట్టినగడువే చాలా పెద్దది.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు డబ్బు కేటాయించే పద్ధతి చూచినప్పుడు అనుకున్న విధంగా 1963-64 సంవత్సరానికి కాక 1964 65 కు కాని పూర్తి అయ్యే అవకాశాలు లేవు. ధరలు పెరగటం మూలంగా ఇంకా రు 8 కోట్లు అధికమవుతుంది. ఇందువలన ప్రాజెక్టు పని యింకా ఆలస్యమయ్యే ప్రమాదమున్నది.

దీనికై ప్రాజెక్టు ప్రథమదశను సకాలంలో పూర్తి చేయుటకు ప్రాజెక్టు కంట్రోలుబోర్డువారు ఇంకా రు 14 కోట్లు అధికంగా కావాలని కేంద్రాన్ని కోరుతున్నారు. ఇంతకుముందు ఇదేవిధంగా కోరినను కేంద్రం తిరస్కరించినది. ఈ సారి కూడా అదేవిధంగా తిరస్కరించినచో ఆంధ్రప్రదేశ్‌కు రు 40 కోట్ల రూపాయల నష్టం కలుగుతుంది.

ఈ రోజు మనదేశములోనున్న ఆహారకొరతదృష్ట్యా, ఈ ప్రాజెక్టును ఎంతత్వరగా పూర్తిచేస్తే అంతత్వరగా ఆహారోత్పత్తి అధికమవుతుంది.

కాన వెంటనే కేంద్రప్రభుత్వము మొదటిదశను త్వరలో పూర్తిచేయుటకుగాను కంట్రోలుబోర్డువారు కోరిన విధంగా రు 14 కోట్లు యింకా యివ్వాలని కోరుతున్నాను.

ఈ విషయములో పార్టీవిభేదాలు లేకుండా మొదటి దశకు కావలసిన అధిక మొత్తాన్ని కేటాయించాలని, రెండవదశనుకూడా వెంటనే ఆమోదించాలని ఐక్యంగా పెద్దఎత్తున ఆందోళన సాగించాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇటు,
గుజ్జుల యల్లమందారెడ్డి,(ఎం ఎల్ ఏ)
ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రతిపక్ష ఉపనాయకుడు, కనిగిరి

బాతుపురానికిపోలీస్‌స్టేషన్

ఆర్యా,

శ్రీకాకుళంజిల్లా టెక్కలితాలూకా బాతుపురం గ్రామానికి పోలీసుస్టేషన్ 30 మైళ్ళ దూరంలోవుంది. ఇదివరలో 4 మైళ్ళలోని కాశిబుగ్గలో యుండెడిది. గత మూడున్నర సంవత్సరముల నుండి 30 మైళ్ళ దూరములోయున్న మెలియాపుట్టి పోలీసుస్టేషన్‌కు మార్చినందున కేసు పంచాయతీలు, నేర విచారణ వగైరాలకు దినములకొలది జరుగుచున్నవి చాలా అసౌకర్యంగా వుంది. స్టేషన్ దూరములో యుండుటచే నేరములుకూడా జరుగుచున్నవి. కావున కాశిబుగ్గకు పోలీస్‌స్టేషనును ఇవ్వాలని ప్రభుత్వమువారిని కోరుచున్నాము.

ఇట్లు,
బాలసరస్వతీ యువజనగ్రంథాలయ సంఘం, బాతుపురం

ఒకటవతరగతి పుస్తకాల కొరత

ఆర్యా,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు 1959 నుండి ఒకటవ తరగతి తెలుగు పాఠ్యగ్రంథమును జాతీయముచేసి యున్నారు. రాష్ట్రములో అన్ని పాఠశాలలలోను ఈ వాచకమునే వాడవలయునని పుత్తర్వు లున్నప్పటికినీ ఈ పుస్తకములు కొన్ని పాఠశాలలకు యింకవరకును లభ్యంకాలేదు. ఆయా రేంజీలకు కేటాయించబడిన పుస్తకముల షాపులలో అడిగితే గవర్నమెంటు ప్రెస్‌నుండి మాకు సప్లయి అవుటలేదని సమాధానం చెప్పుచున్నారు. పాఠశాలలు తెరచి దాదాపు అయిదు మాసములయినను పాఠ్యగ్రంథములు లేనందువల్ల బిడ్డలకు విద్య కుంటుపడుచున్నది.

కాన ఆంధ్రప్రభుత్వము వారు త్వరలో పుస్తకములను ఆ యా షాపులకు పంపవలసినదిగా ప్రార్థన.

కె. మద్దక్క, హెడ్మాస్టర్
ఆరిపిరాల, కృష్ణాజిల్లా

విజయవాడ-రమణక్కపేట లైను ఆర్ టి.సి బస్సులు

ఆర్యా,

విజయవాడ - రమణక్కపేట లైనులో రమణక్కపేటకు మూడున్నర మైళ్ళలో యున్న అడ్డరోడ్డు వరకు మాత్రమే ఆర్ టి సి బస్సులు వచ్చి పోతూ యున్నవి. అందువల్ల గ్రామ ప్రజలు, చుట్టుపట్ల గ్రామాల ప్రజలు నూజివీడునుండి రమణక్కపేటకు వచ్చుటకు యిబ్బంది పడుతున్నారు. రెండు మూడు రోజులకొక పర్యాయంకూడా టపా యిచ్చుటకు వీలుపడుటలేదు. టపా సౌకర్యము, ప్రయాణ సౌకర్యములు సక్రమముగా యేర్పడునట్లు పై అధికారులకెన్ని మహజర్లు పెట్టినా యేమీ చర్య తీసుకోలేదు. మా గ్రామములోకి లారీ సర్వీసు సక్రమముగా నడుచుచున్నది. కావున బస్సులనుకూడా రమణక్కపేటలోనికి వచ్చునట్లు చేయ కోరుచున్నాను.

పోగుల శంకరరావు
ప్రెసిడెంటు,
రమణక్కపేట పంచాయతీ

నర్సీపట్నం మార్కెట్టు దుస్థితి

ఆర్యా,

విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం మార్కెట్టు బొత్తిగా బాగులేదు. సరియైన షెడ్లు లేవు. వర్షం వచ్చిందంటే కూర్చునే చోటుండదు.

ఈమార్కెట్టుకు సరియైన షెడ్లు వేయించి, కూరలు అమ్ముకునేవారికి సరియైన సౌకర్యములు కల్పించవలసిందిగా కోరుతున్నాను.

జి. మాధవ వర్మ, నర్సీపట్నం

లేఖాంశాలు

ఉపాధ్యాయుల అడ్వాన్సు జీతం

గోదావరివరదవల్ల యిబ్బందులపాలైన తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం,రాజమండ్రి,అమలాపురం తాలూకాల ప్రాథమికోపాధ్యాయులకు మూడు మాసాల జీతాన్ని అడ్వాన్సు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ జిల్లా ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి శ్రీ కె గంగిశెట్టిగారు వ్రాస్తున్నారు.

ఉపాధ్యాయుల అడ్‌హాక్ రిలీఫ్

శ్రీకాకుళం జిల్లాలోని పూర్వపు ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూళ్ళ ఉపాధ్యాయులకు గత ఏప్రిల్ నుండి అడ్‌హాక్ రిలీఫ్ రు 5 లు రావటంలేదు. క్రొత్తగా ఏర్పడి ప్రక్కనేవున్న విజయనగరం విద్యా జిల్లాలోని ఉపాధ్యాయులకు వస్తున్నది. కాబట్టి ఇక్కడి ఉపాధ్యాయులకు కూడా సెప్టెంబరు జీతంతోపాటు ఆరునెలల అడ్‌హాక్ రిలీఫ్ కూడా కలిపి యివ్వాలని కలివరం కేంద్రోపాధ్యాయ సంఘ కార్యదర్శి శ్రీ కనుమెట్ట భీష్మాచార్యులు గారు వ్రాస్తున్నారు.

సింగపట్నం దాయీ

మహబూబునగర్ జిల్లా సింగపట్నంలో రెండు సంవత్సరములనుండి వున్న దాయీని బదిలీచేసి అయిదు మాసాలయింది. గర్భిణీ స్త్రీలకు చాలా అసౌకర్యంగా వుంది. కావున వెంటనే వేరే దాయీని పంపించాలని ప్రభుత్వాన్ని కోరుతూ కొల్లాపురం తాలూకా కమ్యూనిస్టు కమిటీ సభ్యుడు శ్రీ కిషన్ గారు వ్రాస్తున్నారు.

ప్రకటన

మచిలీపట్నం యెస్టేట్సు యెబాలిషన్ ట్రిబ్యూనల్ కోర్టులో

E O P 456/54 E I A 239/59

శ్రీ రాజా వెంకటనరసింహ అప్పారావుగారు పిటిషనరు

శ్రీ రాజా వెంకటరామయ్య అప్పారావుగారు వగైరా రెస్పాండెంట్లు

ఈ నెంబరు రివ్యూ పిటిషన్ 1 వ రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తము పబ్లికేషను కొరకు 18 10-59 తేదీకి వాయిదా వేయబడినది. సదరు వాయిదా నాడు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినదిగా, యిందుమూలమున ప్రచురణపరచడమైనది.

వై. శ్రీరామమూర్తి,
పిటీషనర్ అడ్వకేట్


గొంతు మరియు
గుండె బిళ్లలను
మీరు
పేవి చేయడం
మీ దగ్గు త్వరితంగా పోవును
గొంతు నొప్పి
పి ఇ ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట లి

ఏజెంట్లు: దాదా & కో
88 నైనియప్పనాయక్ వీధి మద్రాస్-1

కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాలకు సంయుక్త కలెక్టర్ల నియామకం : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 5

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయోగాత్మక చర్యగా కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాలకు సంయుక్త కలెక్టర్లను నియమించింది. రెండు జిల్లాలకు కలిపి సంయుక్త కలెక్టరు పదవిని సృష్టించడం ఇదే మొదలు.

ప్రణాళిక, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించే బాధ్యతను ఇక నుండి ఈ సంయుక్త కలెక్టర్లు నిర్వహిస్తారు. కలెక్టరూ, సంయుక్త కలెక్టరు మధ్య పని విభజనను రెవిన్యూబోర్డు నిర్ణయిస్తుంది.

ఈ ప్రయోగాత్మక చర్య సంతృప్తికరంగా ఉన్నట్లయితే, ఈ పద్ధతిని ఇతర జిల్లాలకుకూడ విస్తరింపచేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రతినిధి పత్రికలవారితో చెప్పారు.

వరంగల్లు సబ్ కలెక్టరు శ్రీ వి కె బాకార్ కర్నూలు జిల్లా సంయుక్త కలెక్టరుగా నియమించబడ్డారు.

మెదక్ సబ్ కలెక్టరుగా ఉన్న శ్రీ జామ్ అబ్బాసి, మహబూబ్ నగర్ జిల్లా సంయుక్త కలెక్టరుగా నియమించబడ్డారు.

బండారు నాయకే హంతకుని పరిస్థితి

కొలంబో, అక్టోబరు 5

బండారు నాయకే హత్యకేసులో బౌద్ధసన్యాసిని, రేపు మేజిస్ట్రేటు ఎదుట హాజరు పెట్టడానికి వీలైన స్థితిలో ఉంటాడో లేదో జైలు అధికారులు ఇంకా చెప్పలేని స్థితిలో ఉన్నారు. బండారు నాయకేపై ఈ వ్యక్తి కాల్పులు జరిపినప్పుడు ఒక కావలాదారుడు జరిపిన కాల్పులవలన ఇతడు గాయపడ్డాడు. ఈ గాయం వలన హంతకుడు హాజరు కాలేని స్థితిలో ఉంటే కేసు వాయిదా కోరతారు.

జీవితభీమా కార్పొరేషన్ ఫీల్డు ఉద్యోగుల సమ్మె సన్నాహం

నాగపూర్, అక్టోబరు 5

అక్టోబరు 30వ తేదీన ఒక రోజు నిరసన సమ్మె జరపాలనీ, అక్టోబరు 24 లోగా తమ కోర్కెలను గురించి తగు సమాధానం రానిచో కాలపరిమితి లేకుండా సమ్మె ప్రారంభించాలని జీవితభీమా కార్పొరేషన్ ఫీల్డు ఉద్యోగుల సమాఖ్య నిన్న ఇక్కడ తీర్మానించింది.

కేరళవిద్యాచట్టాన్ని మార్చరాదు

మాజీ కాంగ్రెస్ శాసనసభ్యుని విజ్ఞప్తి

తిరువనంతపురం, అక్టోబరు 5

కేరళ విద్యాచట్టంలో రాష్ట్రగవర్నరు ఎటువంటి మార్పులు, మినహాయింపులు చేయకుండా ఆదేశించవలసిందిగా రాష్ట్రపతిని కోరుతూ ఎజ్వా సంఘ కార్యదర్శి, పూర్వపు శాసనసభ సభ్యుడు అయిన శ్రీ కె ఆర్ నారాయణ నేడు ఒక టెలిగ్రాము పంపారు.

ఇదే టెలిగ్రామును ప్రధాని నెహ్రూకు, కాంగ్రెసు అధ్యక్షురాలికి కూడా శ్రీ నారాయణ పంపారు.

రాష్ట్ర గవర్నరుకు శ్రీ నారాయణ ఒక మెమొరాండం సమర్పిస్తూ రాష్ట్రపతి పాలనలో విద్యాచట్టాన్ని మార్చడానికి ప్రయత్నించరాదనీ, మార్పులు చేయవలసివస్తే నూతన శాసనసభకు మాత్రమే అట్టి హక్కు ఉందని తెలియజేశారు.

రాష్ట్ర విద్యాశాఖ డైరక్టరును సమావేశకర్తగా తాత్కాలిక ప్రభుత్వం సబ్ కమిటీని నియమించింది. ఈ సబ్ కమిటీ కేవలం విద్యాచట్టంలో చేయదగు మార్పులు, మినహాయింపులు సూచించవలసిందిగా కోరారు. ఇది అత్యధిక సంఖ్యాక ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమైన చర్య అని శ్రీ నారాయణ విమర్శించారు.

అందువలన ఈ సబ్ కమిటీ పాత్ర ఏమిటో నిర్వచించవలసిందనీ, సబ్ కమిటీ ఎట్టి సిఫారసులు చేసినప్పటికీ చట్టంలో ప్రస్తుతం ఎట్టి మార్పులు చేయరాదనీ ఆయన గవర్నరుకు విజ్ఞప్తి చేశారు.

తాను పోటీ చేయనని పనంపల్లి గోవిందమీనన్

త్రిచూరు, అక్టోబరు 4

కేరళలో జరుగనున్న ఎన్నికల్లో తాను పోటీచేయడంలేదని తిరువాన్కూరు కొచ్చిన్ మాజీముఖ్యమంత్రి పనంపల్లి గోవిందమీనన్ నేడు ఇక్కడ ఒక సభలో మాట్లాడుతూ ప్రకటించారు.

ఆంధ్ర కేంద్ర సహకార బ్యాంకు రు 150 లక్షల రుణానికి ప్రభుత్వం హామీ

హైదరాబాద్, అక్టోబరు 5

విజయవాడలోని ఆంధ్ర కేంద్ర సహకార బ్యాంకు, రిజర్వు బ్యాంకు నుండి రు 150 లక్షల రుణాన్ని తీసుకోడానికి ప్రభుత్వ హామీ యిస్తూ ఆంధ్ర ప్రదేశ్ మంత్రివర్గం నేడు నిర్ణయించింది. కేంద్ర సహకార భూమి తనఖా బ్యాంకు ఇదే విధంగా ప్రభుత్వ బ్యాంకునుండి రు 50 లక్షలు ఋణం తీసుకోడానికి హామీ యిస్తూ నిర్ణయించింది. ఇట్టి హామీ ఒక సంవత్సరం వరకు గాని డిబెంచర్లు వసూలు చేసేవరకు గాని యిస్తారు.

బీహారులో ఇప్పటికి 2006 మంది అరెస్టు

పాట్నా, అక్టోబరు 5

అధిక ధరలకు, అధిక పన్నులకు వ్యతిరేకంగా ప్రారంభమైన సత్యాగ్రహంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఇప్పటికి 2006 మంది అరెస్టయ్యారు. దాదాపు 7070 మందివరకు సత్యాగ్రహంలో పాల్గొన్నారు, అయితే అందులో 2006 మందిని మాత్రమే పోలీసులు అరెస్టు చేశారని ఆందోళనకమిటీ తెలియజేసింది.

శిఖరాగ్ర సమావేశం

ఒడంబడిక ఏమీ జరుగలేదని జేమ్స్ హాగర్టీ

కాలిఫోర్నియా, అక్టోబరు 3

శిఖరాగ్ర సమావేశ విషయంలో ఒడంబడిక అనేది ఏదీ జరగలేదనీ, తమ మిత్ర దేశాలను సంప్రదించి వారి అభిప్రాయాలను తెలుసుకొనేవరకు శిఖరాగ్ర సమావేశం జరగదనీ ఐసెన్ హోవర్ సమాచార కార్యదర్శి జేమ్స్ హాగర్టీ నేడన్నారు.

బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ శిఖరాగ్ర సమావేశానికి అన్నీ సిద్ధమయ్యాయనీ, తేదీలు నిర్ణయించడమే తరువాయి అనీ అన్న మాటలను గురించి మీ అభిప్రాయమేమని ఒక విలేఖరి ప్రశ్నించగా హాగర్టీ పై విధంగా చెప్పారు.

చిత్తూరు, కడప జిల్లాల్లో పంటనష్టం

రెవిన్యూబోర్డు సభ్యుని నివేదిక

హైదరాబాద్, అక్టోబరు 5

చిత్తూరు, కడప జిల్లాల్లో పంటలు పండలేదని పత్రికల్లో వచ్చిన వార్తల ఫలితంగా, రెవిన్యూబోర్డు సభ్యులైన శ్రీ యం టి రాజు ఆ ప్రదేశాలు పర్యటించి రెవిన్యూమంత్రికి తన నివేదిక నందజేశారు. రెవిన్యూమంత్రి ఆ నివేదికను పరిశీలిస్తున్నారు.

తూర్పు, పశ్చిమ గోదావరిజిల్లాల్లో ఈమధ్య వచ్చిన వరదల మూలంగా పంటలకు జరిగిన నష్టం గురించి ఆ జిల్లాల కలెక్టర్లవద్ద నివేదికలు ఇంకా రావలసి ఉంది. (వి వి)

పిడబ్ల్యుడి తత్వంమాత్రం మారడంలేదని శ్రీ నెహ్రూ

పూనా, అక్టోబరు 5

"ప్రపంచమంతా మారుతోంది కాని, భారతదేశంలో పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంట్ మాత్రం మారడంలేదు. ఆ డిపార్టుమెంటు వారు కడుతున్న కొత్తబిల్డింగులను బట్టిచూస్తే వారు బ్రిటిషు వారసత్వాన్ని కొనసాగిస్తున్నారని చెప్పాలి" అని భారత ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ నేడు పూనా సేవాసదనంలో ప్రసంగిస్తూ అన్నారు.

ప్రజాస్వామిక వాదులకూ పార్టీ సభ్యులకూ ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గం విజ్ఞప్తి

విజయవాడ, అక్టోబరు 5

పంచాయితీ ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను గురించి ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గం చేసిన తీర్మానంలో యీ కింది భాగం కూడా వుంది (మిగతా భాగాన్ని నిన్న ప్రకటించాం)

పంచాయితీ ఎన్నికల్లో ఓటర్లను, సభ్యులను కొనివేసే పద్ధతి అమలులోకి వస్తే ఎన్నికల ప్రజాస్వామ్య స్వరూపం అడుగంటుతుంది. ప్రజాభిప్రాయం వ్యక్తంకాదు. ఎన్నికల ఫలితాన్ని ప్రజాభిప్రాయంగాక, డబ్బే నిర్ణయించుతుంది. అందుచే అన్ని పార్టీలలోవున్న ప్రజాస్వామిక వాదులు యీ ఎన్నికలలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను, లంచగొండితనాన్ని ఖండించవలసిందిగా కార్యవర్గం విజ్ఞప్తి చేస్తున్నది.

నేడు ప్రజల పార్టీయైన కమ్యూనిస్టుపార్టీపైన యీ సందర్భంలో ప్రత్యేక బాధ్యత వున్నదని పార్టీ కంతటికీ కార్యవర్గం హెచ్చరించుతున్నది. పార్టీ సభ్యులు, మిత్రులు యీ ఎన్నికలలో జరుగుతున్న అవాంఛనీయ విధానాలను ప్రతిఘటించాలనీ, స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగకుండా కాలుష్యం ఏర్పరుస్తున్న ఆటంకాలను తొలగించడానికి ప్రజాస్వామిక వాదులందరిని ఐక్యపరచవలసిందనీ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గం విజ్ఞప్తి చేస్తున్నది.

మధ్య ప్రదేశ్ శాసనసభ వద్ద అరెస్టులు

భోపాల్, అక్టోబరు 5

మధ్యప్రదేశ్ శాసనసభ వద్ద నిషేధాజ్ఞలు ఉల్లంఘించినందుకుగాను మొత్తం 25 మందిని నేడు అరెస్టు చేశారు. ఇందులో 11 మంది కమ్యూనిస్టులు, 9 మంది హిందూ మహాసభవారు, అయిదుగురు జనసంఘ సభ్యులు వున్నారు.

శాసనసభలో ప్రవేశపెట్టిన ప్రజారక్షణబిల్లు, అత్యవసర సర్వీసుల రక్షణ బిల్లులపట్ల నిరసనతెలుపుతూ ఊరేగింపుగా వారు వేర్వేరుగా ప్రదర్శనలు జరిపిన సందర్భంలో ఈ విధంగా అరెస్టుచేశారు. ఈ ప్రజా వ్యతిరేక బిల్లులను ఉపసంహరించాలని వారు నినాదాలు చేశారు. నల్లజెండాలు ధరించి నిషేధాజ్ఞలను ఉల్లంఘించారు.

రైతులకు బండి పట్టాలు యిరుసులు సరఫరా

హైదరాబాద్, అక్టోబరు 5

ఒక జత బండి పట్టాలు, యిరుసు కావలసివస్తే వ్యవసాయశాఖ డెమాన్ స్ట్రేటరు, అంతకుమించి రెండుటన్నుల లోపుగా ఈ సామగ్రి కావలసివస్తే జిల్లా వ్యవసాయశాఖ డెమాన్ స్ట్రేటరు, రెండుటన్నులు మించి కావలిస్తే వ్యవసాయశాఖ డైరక్టరు పర్మిట్లు యిస్తారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేడు ఒక ప్రకటన చేసింది.

అంటార్కిటిక్ పై అంతర్జాతీయ ఒడంబడిక?

వాషింగ్టన్, అక్టోబరు 4

అంటార్కిటిక్ పై ఏవిధమైన సైనిక కేంద్రాలు, ఆయుధగిడ్డంగులూ వుంచకూడదని 12 దేశాల మధ్య ఒడంబడిక జరిగే సూచనలున్నవి.

ఈ విషయమై 12 దేశాల ప్రతినిధులు కలిసి చర్చించి తాము అనుసరించవలసిన సూత్రాల ముసాయిదాను తయారుచేశారు.

ఇక్కడ అక్టోబరు 15న 12 దేశాల విదేశాంగ మంత్రులు సమావేశమై ఈ ముసాయిదాను చర్చిస్తారు.

అంటార్కిటిక్ ప్రాంతంపై శాస్త్రీయ పరిశోధనలు జరిపిన 12 దేశాలు ఈ సమావేశంలో పాల్గొంటాయి. వీనిలో సోవియట్ యూనియన్, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, ఆస్ట్రేలియా, బెల్జియం, తదితర దేశాలున్నాయి.

హైద్రాబాద్ లో శ్రీ బసవపున్నయ్య

హైదరాబాద్, అక్టోబరు 6

భారత కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శులలో ఒకరైన శ్రీ మాకినేని బసవపున్నయ్యగారు (ఎం పి) ఢిల్లీ నుండి నేటి వుదయం ఇక్కడికి వచ్చారు. రేపు పూరి ప్యాసెంజర్ లో విజయవాడకు బయలుదేరుతారు. (వి వి)

విమానాల ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

బ్రిటన్ లో

లాంక్ షైర్, అక్టోబరు 4

బ్రిటన్ లో హైడ్రోజన్ బాంబులను ప్రయోగించడానికి ఉపయోగించే విమానాలను తయారుచేసే ఫ్యాక్టరీలో ఏదో ప్రేలి నిప్పంటుకొన్నది.

ఫ్యాక్టరీనుండి వెలువడిన అగ్నిజ్వాలలు 8 మైళ్ళ దూరంవరకు కనిపించాయి.

2½ గంటలకు మంటలను అదుపులోనికి తేగలిగారు.

దామోదర వరద తగ్గుముఖం

బర్ద్వాన్, అక్టోబరు 4

దామోదరనదిలో వరద క్రమంగా తీస్తోంది కనుక బర్ద్వాన్ నగరానికి ప్రమాదం తప్పినట్లు ఎంచుకున్నారు.

కాని ఖట్వా ప్రాంతంలో భగీరథి నది నీటిమట్టం ఇంకా పెరుగుతూనే వుంది. 8 రోజులుగా ఎడతెరపిలేని వర్షాలవలన కాల్నా సబ్ డివిజన్ లోని 150 గ్రామాలకు అపారనష్టం కలిగింది. ఈ ప్రాంతంలోగల 95 వేల ఎకరాలలో పంట నూటికి 70 పాళ్లు పాడయిపోయింది. బర్ద్వాన్ జిల్లాలో 150 ఇళ్లు కూలిపోయాయి.

కుస్కారా ప్రాంతంలో వరదలవల్ల 50 చదరపుమైళ్ళ భూభాగం పూర్తిగా నీటిలో మునిగిపోయింది. అధికారులు 10 వేల మణుగుల బియ్యం బస్తాలను ఈ ప్రాంతానికి పడవల్లో పంపించారు.

'సహనం అవసరం'

ఉపరాష్ట్రపతి ఉద్బోధ

అహ్మదాబాద్, అక్టోబరు 5

"ప్రజలెప్పుడూ ఓరిమిని, సహనసంప్రదాయాన్ని అలవర్చుకోవడానికి ప్రయత్నించాలి. తమ అభిప్రాయాలను యితరులపై బలవంతంగా రుద్దడానికి ప్రయత్నించరాదు" అని ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ నేడిక్కడొక సందర్భంలో ప్రసంగిస్తూ ఉద్బోధించారు.

సహనం, ఓరిమి లేకపోవడమే అప్పుడప్పుడు పార్లమెంటులోను, శాసనసభలలోను ప్రత్యక్ష చర్యలకు కారణం అని ఆయన అన్నారు.

కేరళ వ్యవసాయ సంబంధాల బిల్లు

త్రివేంద్రం, అక్టోబరు 5

కేరళ వ్యవసాయ సంబంధాల బిల్లుకు త్వరగా ఆమోదముద్ర వేయాలని రాష్ట్రపతిని కోరుతూ ఒక మహజరుపై రైతులవద్ద సంతకాలు సేకరించే కార్యక్రమాన్ని కేరళ కర్షక సంఘం నిర్విరామంగా సాగిస్తున్నది.

వ్యవసాయ సంబంధాల బిల్లుపై రాష్ట్రపతి ఆమోదముద్ర పొందడమే కాకుండా, వ్యవసాయ కార్మికుల ఋణ విమోచన చట్ట సవరణబిల్లు, కేరళ కోర్టుఫీజు బిల్లులకు కూడ రాష్ట్రపతి ఆమోదం లభించేట్లు ఆందోళన చేయవలసిన అవసరం ఎంతైనా కలదని మాజీ న్యాయశాఖామంత్రి శ్రీ కృష్ణయ్యర్ నొక్కి చెప్పారు.

వ్యవసాయ సంబంధాల బిల్లుకు సంబంధించినంతవరకు కేరళ కాంగ్రెస్ పరిస్థితి ఇప్పటికీ అయోమయంగా వుంది. బిల్లును బలపరుస్తూ కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకత్వం కిందవున్న కేరళ కిసాన్ కాంగ్రెసు ఇదివరకే తీర్మానాలు చేసింది. అయితే కేరళ ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ ఇప్పటికీ తన అభిప్రాయాన్ని వెల్లడపరచలేదు.

ఫుట్ బాల్

బరోడా, అక్టోబరు 4

భారత అంతర్విశ్వవిద్యాలయ ఫుట్ బాల్ పోటీల్లో ఉస్మానియా జట్టు బొంబాయి జట్టును ఒకగోలుతో ఓడించింది.

టెన్నిస్

కృష్ణన్ విజయం

బెర్కిలీ, అక్టోబరు 4

బెర్కిలీలో జరుగుతూన్న పసిఫిక్ లాన్ టెన్నిస్ పోటీల్లో, భారత టెన్నిస్ ఛాంపియన్ ఆర్ కృష్ణన్, కాలిఫోర్నియాకు చెందిన కె హోప్స్ ను నిన్న సెమీఫైనల్సులో ఓడించి ఫైనల్సుకు వచ్చారు. కృష్ణన్ ఫైనల్సులో ఒహియోకు చెందిన మాకేతో ఆడవలసి ఉంది.

కేరళ, ఆంధ్రజట్టుల డ్రా

బెంగుళూరు, అక్టోబరు 5

జాతీయ ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్పులకై బెంగుళూరులో జరుగుతున్న దక్షిణమండల ఫుట్ బాల్ పోటీల ఫైనల్సులో ఆంధ్రజట్టు కేరళజట్టుతో డ్రా అయింది.

ముస్లింలీగ్ కు తిరిగి ప్రాణప్రతిష్ఠ: బొంబాయి, ఆంధ్రలకు ఆర్గనైజింగ్ కమిటీలు

మద్రాసు, అక్టోబరు 5

ముస్లిం లీగ్ ను పునర్నిర్మించేందుకుగాను ఆంధ్ర, బొంబాయి రాష్ట్రాలకు ఆర్గనైజింగ్ కమిటీలను నియమిస్తూ భారత ముస్లిం లీగ్ అధ్యక్షుడు శ్రీ మహమ్మద్ ఇస్మాయిల్ నేడు ప్రకటించారు.

ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకుకూడా త్వరలో ఇటువంటి ఆర్గనైజింగ్ కమిటీలను నియమిస్తామని శ్రీ ఇస్మాయిల్ తెలియజేశారు.

బొంబాయి ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడుగా శ్రీ నూర్ మహమ్మద్, ఆంధ్ర కమిటీ అధ్యక్షుడుగా హైద్రాబాదుకు చెందిన అబ్దుల్ లతీఫ్ ఖాన్ ఉంటారని ఇస్మాయిల్ తెలియజేశారు.

దేశఐక్యత, భద్రత, భాగ్యోదయం, సౌఖ్యమే ముస్లింలీగ్ ఆశయాలని ఆయన తెలిపారు.

"ముస్లిములకు మేము ప్రత్యేక హక్కులు కోరటంలేదు. ఇతర జాతులవారితో సరిసమాన స్థానాన్ని మాత్రమే కోరుతున్నాము" అని ఇస్మాయిల్ అన్నారు.

అన్ని తరగతుల ప్రజలకూ విద్యావ్యాప్తి జరగాలి

శ్రీ నెహ్రూ ప్రసంగం

పూనా, అక్టోబరు 5

భారతదేశంలో సాంఘిక విప్లవం జరుగుతోందనీ, ప్రజల్లో అన్ని తరగతులకూ విద్య వ్యాపించాలని శ్రీ నెహ్రూ పూనా సేవాసదన్ లో ప్రసంగించారు.

పూనా సేవాసదన్ సంఘ స్వర్ణోత్సవానికి శ్రీ నెహ్రూ అధ్యక్షత వహించారు. ఈ సేవాసదనంలో కుల మత వివక్ష లేకుండా మహిళలకు విద్య నేర్పబడుతుంది.

శ్రీ నెహ్రూ ఇంకా ఈ విధంగా చెప్పారు:

ప్రజాబాహుళ్య అభ్యుదయ కార్యక్రమాలలో స్త్రీ విద్యకు ప్రముఖ స్థానమున్నది. ఒక యువకుడు విద్య నేర్చిస్తే తన జీవితాన్ని మాత్రమే అభివృద్ధి చేసుకుంటాడు. కాని స్త్రీ విద్యావంతురాలయినట్లయితే, మొత్తం కుటుంబంయొక్క అలవాట్లనూ, ఆలోచనలను మార్చుతుంది.

ఉపాధ్యాయుల అవసరాలపట్ల విద్యాసంస్థలవారు ఎక్కువ దృష్టిని ప్రసరింపచేయాలి. పెద్ద పెద్ద భవనాల ఆడంబరత్వానికి పోవద్దని శ్రీ నెహ్రూ సలహా యిచ్చారు.

స్త్రీల శిఖరారోహణ ప్రయత్నం

ఖాట్మండు, అక్టోబరు 4

చొయో ఓయు శిఖరాన్ని ఎక్కబోతున్న మహిళల జట్టులోని ఇద్దరు స్త్రీలను నేడు క్రిందికి తీసుకొని రావలసివచ్చింది. ఎత్తు ప్రదేశాలలో సాధారణంగా వచ్చే జబ్బు వీరికి వచ్చిందట. ఈ శిఖరం ఎత్తు 26,867 అడుగులు. ఇప్పటికి 22500 అడుగుల ఎత్తు ఎక్కారు.

లాకౌట్లు సమ్మెలు

శ్రీ గిరి వ్యాఖ్య

డోరియా, అక్టోబరు 5

యజమానులకు లాకౌట్ ప్రకటించడానికి ఎంత హక్కువుందో, కార్మికులకు కూడా సమ్మెచేయడానికి అంతే హక్కు వుందని ఉత్తర ప్రదేశ్ గవర్నర్ శ్రీ వి వి గిరి నిన్న ఇక్కడ చెప్పారు.

సమ్మె చేయడంవల్ల ఎక్కువ నష్టపోయేది తామేనన్న సంగతిని కార్మికులు గుర్తించాలన్నారు. సమస్యా పరిష్కారానికి అన్ని పద్ధతులూ విఫలమైనప్పుడు మాత్రమే సమ్మె చేయాలన్నారు.

అణ్వస్త్ర పరీక్షలపై సంభాషణల వాయిదా

లండన్, అక్టోబరు 5

జనీవాలో ప్రస్తుతం సాగుతున్న అణ్వస్త్ర పరీక్షలపై సంభాషణలను బ్రిటన్ లో రాబోయే ఎన్నికలదృష్ట్యా ఒక పక్షంరోజులు వాయిదావేయాలని బ్రిటిష్ ప్రభుత్వం తోటిరాజ్యాలను అభ్యర్థించింది.

ఇందుకు సోవియట్ రష్యా సమ్మతిస్తూ అక్టోబరు 27వ తేదీన తిరిగి ఈ సంభాషణలు సాగించడానికి తన కేమీ అభ్యంతరం లేదని బ్రిటన్ కు పంపిన ఒక పత్రంలో తెలిపింది. ఇలాంటి ఆమోదాన్నే అమెరికా కూడ తెలియజేసింది.

అంతర్గ్రహ కేంద్రం

(1వ పేజీ తరువాయి)

కేంద్రం చంద్రునిచుట్టూ ఒకసారి కంటె ఎక్కువే తిరుగుతుందని సోవియట్ శాస్త్రజ్ఞులు నిన్నరాత్రి టెలివిజన్ గోష్ఠిలో తెలిపారు. చంద్రుని 6,250 మైళ్ళ దూరాన చుట్టూ తిరిగి, ఆ తర్వాత ఇది భూమండలంలోకి చేరుతుంది.

ఈ విషయమై మాట్లాడుతూ ప్రముఖ రష్యన్ శాస్త్రవేత్త షైవ్ రావ్ ఇలా అన్నారు: "చంద్రునిపై మిలిటరీ స్థావరాలు స్థాపించే యోచన యేమీలేదు. అక్కడ మా సోవియట్ చిహ్నం ఉన్నమాటనిజమే. అయినా మేమేమీ చంద్రునిచుట్టు దడికట్టి ఇతరులకేమీ కావులేదని చెప్పబోవడంలేదు."

ఇంతకుముందు మాట్లాడిన మరో శాస్త్రవేత్త యీ అంతర్గ్రహ యాన కేంద్రం ఇప్పుడు చంద్రునిచుట్టు తిరుగుతున్నందువల్ల దానినుండి సాంకేతిక ధ్వనులద్వారా అందే సమాచారాన్ని బట్టి ఇదివరకటికంటె చంద్రుడు భూమికి 38 రెట్లు ఎక్కువ దగ్గరగా వున్నంత వివరాలు సేకరించబడుతున్నాయన్నారు.

'చంద్రునిచుట్టూ యీ రాకెట్టు తిరిగేలా చేయడంవల్ల ఒక కొత్త శకం చేరుకుంటున్నాం. చంద్రునికికూడ ఒక కృత్రిమ ఉపగ్రహాన్ని చేర్చగలిగిన విధంగా దీనివల్ల సహజసిద్ధమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి" అన్నారు.

"న్యూయార్కు సండే న్యూస్" అన్న పత్రికలో త్వరలోనే రష్యా చంద్రునివద్దకు మానవులను పంపి, సురక్షితంగా తిరిగి వారిని భూమిమీదికి తేబోతున్నదని ఒక రిపోర్టు ప్రకటింపబడింది.

దీని ప్రకారం అమెరికాకు ఇంతవరకు తెలియని రాకెట్ ప్రయోగ పద్ధతులను రష్యా ఆచరించగలుగుతున్నదనీ, దీనివల్ల యీ ప్రయోగ పరిశోధనలో కేవలం కొన్ని కార్యక్రమాన్ని ఎనిమిది నుంచి 20 ఏండ్లవరకు ముందుగానే సాధించిందని తెలిపింది.

1960 65 మధ్య మానవ చోదిత కేంద్రాలు చంద్రునివద్దకు ప్రయాణం చేస్తాయని కూడ ఆ పత్రిక వ్రాసింది.

ఇంగ్లండులోని ప్రఖ్యాతమైన జోడ్రల్ బ్యాంక్ నక్షత్రశాలలో శాస్త్రవేత్త డాక్టర్ డేవిస్ ఇలా అన్నారు:

"గత సెప్టెంబరు 12 తేదీ తర్వాత ఇంత త్వరలోనే రష్యా మరో రాకెట్ ను ఇంత విజయవంతంగా పంపగలగడం ఒక మహాద్భుతం"

బ్రిటిష్ అంతర్గ్రహ సంఘం ఉపాధ్యక్షులు కెన్నెత్ గాట్లాండ్ ఇలా అన్నారు: "అంతర్గ్రహ పరిశోధనల్లో సోవియట్ దేశం సాధించిన విజయాలను వర్ణించడానికి తగిన విశేషణాలను కనిపెట్టడం మరీ కష్టమవుతోంది"

రష్యా జరుపుతున్న యీ పరిశోధనలవల్ల చంద్రునిలోని మిగిలిన సగం రెండువంతుల భాగంలో ఏమున్నదో ఇప్పుడు తెలుసుకో గలుగుతామని బ్రిటిష్ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

కేరళలో

రివల్యూషనరీ సోషలిస్టు పార్టీసభ్యుల రాజీనామాలు

కమ్యూనిస్టుపార్టీపై గుడ్డిద్వేషానికి నిరసనగా

త్రివేంద్రం, అక్టోబరు 6

రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ కోజికోడ్ జిల్లా కమిటీసభ్యులు, ప్రస్తుతం తమ పార్టీ అనుసరిస్తున్న అభివృద్ధి నిరోధక విధానానికి నిరసనగా తమ సభ్యత్వాలకు రాజీనామా ఇచ్చారు.

ఈ నిర్ణయం జరిగిన వెంటనే కోజికోడ్ తాలూకా కమిటీ సభ్యులు కూడ వారిని అనుసరించారు. కమిటీలోని మొత్తం 28 మంది సభ్యులు రాజీనామా ఇచ్చారు. ఇక కోజికోడ్ లో రాజీనామా ఇవ్వకుండా మిగిలినవారు నలుగురు మాత్రమే.

కాంగ్రెసు నాయకత్వం యొక్క కపటనీతిని, అందుచేత దానిని అధికారంలోనుండి దించివేయడానికై కమ్యూనిస్టుపార్టీతో సహా అన్ని వామపక్షాలూ కలిసి ఐక్యసంఘటనను ఏర్పాటుచేయాలని మొన్నటివరకూ చెబుతూ వచ్చిన రివల్యూషనరీ సోషలిస్టుపార్టీ ఇప్పుడు కేరళలో కమ్యూనిస్టుపార్టీపై గుడ్డిద్వేషంతో కాంగ్రెస్ తో ఎన్నికల ఒప్పందాన్ని రూపొందించుకోవడం పార్టీ మూలసూత్రాలకు విరుద్ధమని జిల్లాకమిటీ ప్రకటనలో పేర్కొన్నారు.

రివల్యూషనరీ సోషలిస్టుపార్టీకి కేరళ బయట, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ లో కమ్యూనిస్టు పార్టీ మిత్రుడుగాను, కాంగ్రెస్ శత్రువుగాను వున్నాయని, ఈ విధానాన్ని కేరళలో ఎందుకు అమలుజరపడం లేదని ప్రశ్నించారు. కేరళ విద్యాబిల్లు, వ్యవసాయ సంబంధాలబిల్లు తగినంత విప్లవాత్మకంగా లేవనిచెప్పి, కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని వ్యతిరేకించినవారు ఆ బిల్లులలో కొన్ని చిన్న సవరణలు చేయడం అవసరమని చెప్పడం శోచనీయమన్నారు.

కేరళలో వివిధ ప్రాంతాలలోగల రివల్యూషనరీ సోషలిస్టుపార్టీ సభ్యులు పార్టీ ఇప్పుడు అనుసరిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తున్నారని, వారంతా ఆలస్యంలేకుండా పార్టీనుండి వైదొలగాలని కోరారు.

మార్క్సిజం - లెనినిజంలో తమకు ఇప్పటికీ విశ్వాసం వుందని, శ్రామిక వర్గం చేతులలోనే మానవజాతి భవిష్యత్తు వుందని ఉద్ఘాటించారు.

ఇన్ ఫ్లూయంజాకు కొత్తమందు

లండన్, అక్టోబరు 5

ఇంతవరకు ఇన్ ఫ్లూయంజా వ్యాధిని గురించి తెలిసిన అన్ని రకాల వ్యాధులను నూటికి 70 80 పాళ్లు తప్పనిసరిగా నయంచేసే ఒక కొత్తమందును బ్రిటిష్ శాస్త్రవేత్తలు, పరిశోధకులు కలిసి తయారుచేశారని అంటున్నారు.

ఇదొక టీకామందు రూపంలో వుంటుంది. దీనిని మూడురకాల ఇన్ ఫ్లూయంజా క్రిములతో తయారుచేశారని ఒక వైద్యపరిశోధనా సంస్థ అధిపతి డా॥ రైట్ తెలుపుతున్నారు.

ఏ సంవత్సరం ఏరకపు ఇన్ ఫ్లూయంజా వ్యాధి వచ్చినా ఆ వ్యాధి అందుకు తగినట్లుగా ఇదులో మార్పులు చేసి వాడితే తప్పకుండా రోగం కుదురుతుందట.

సమ్మెకు పంచదార కార్మికుల సన్నాహం

హైదరాబాద్, అక్టోబరు 6

సమ్మెకు పూర్తిగా సంసిద్ధులై వుండాలని పంచదార కార్మికులను కోరుతూ సుగర్ ఫ్యాక్టరీ మజ్దూర్ సభ 9వ వార్షిక సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశం శుక్రవారంనాడు షక్కర్ నగర్ వద్ద ఊట్ పల్లిలో జరిగింది.

పదిహేను రోజులుగా కార్మికుల న్యాయమైనకోర్కెలను పరిష్కరించకపోతే, బ్యాలెట్ తీసుకొని, మేనేజిమెంటుకు సమ్మె నోటీసు ఇవ్వాలని ఈ సమావేశం జనరల్ కౌన్సిల్ ను కోరింది.

సభాధ్యక్షుడు శ్రీ ఎస్ బి గిరి తీర్మానాన్ని వివరించారు. మధ్యవర్తిత్వంకోసం చేసిన ప్రతిపాదనలను మేనేజిమెంటు తిరస్కరించినందువల్ల కార్మికులు పోరాడడానికి సిద్ధపడవలసి వచ్చిందన్నారు.

ఆంధ్ర హైకోర్టు బార్ కౌన్సిల్ ఉపన్యాసాలు

హైదరాబాద్, అక్టోబరు 5

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ కౌన్సిల్, హైదరాబాద్ వారు 1959 నవంబరులో "లా అప్రెంటిస్" ల కోసం ఉపన్యాసాలు ఏర్పాటు చేస్తున్నారు.

బహుశా నవంబరు 2వ తేదీనుండి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. నాగర్ రాం భగవాన్ దాస్ సైన్సు కాలేజి (జూబిలీ పోస్టాఫీసు వెనుక) పత్తర్ ఘట్టీ, హైదరాబాద్ లో ఉపన్యాసాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమం నవంబరు 30వ తేదీవరకు కొనసాగుతుంది.

హైకోర్టుకు అనుకొనివున్న సిటీ కాలేజిలో 1959 నవంబరు 15, 22 తేదీలలో పరీక్ష ఏర్పాటుచేశారు.

వేల్పూరు

కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా వేల్పూరు పంచాయితీకి పోటీలేకుండా ఈ క్రింది కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులు గెలుపొందారు:

శ్రీయుతులు నీలకంఠం వీరయ్య, రత్నం రామచంద్ర వరప్రసాదరావు, వంగూరు లక్ష్మయ్య, రత్నం మదనమోహనరావు, యారబర్ల హనుమంతరావు, కులకాని అంజయ్యగార్లు.

ట్రేడ్ యూనియన్ భవననిధి

విజయవాడ అక్టోబరు 6

అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు భవననిధికి యింతవరకు క్రింది విరాళాలు అందినట్లు కార్యదర్శి శ్రీ కోళ్ళపల్లి సత్యనారాయణగారు ప్రకటించారు.

ఆంధ్ర సిమెంటు కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ రు 200 లు, విజయవాడ ఫ్యాక్టరీ లేబర్ యూనియన్ (సభ్యునికి 1 0 0 చొప్పున) రు 100 లు, తూర్పు గోదావరిజిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ రు 58 లు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రు 21 లు, మొత్తము రు 379 లు.

సవరణ

హైదరాబాద్, అక్టోబరు 6

ఈ నెల 5వ తేదీ విశాలాంధ్ర సంచిక రెండవ పేజీలో 'పంచాయితీ ఎన్నికల నిబంధనలు' అను వ్యాసంలో ఈ క్రింది మార్పులు గమనించాలి:

1 మూడో కాలం, 12వ లైనులో జరిగిన అచ్చుపోటు గిరిజన అని,

2 మూడో కాలం, రెండవ పేరా, 9 లైనులో 19 10 59 కి బదులు 29 10 59 అని 3 4వ కాలంలో అనర్హులు అనే సబ్ హెడ్డింగ్ క్రింద 'వ్యతిరేకంగాని' నే మాట తర్వాత పనిచేయుచున్న, అని చదువుకోవాలి.

కోయంబత్తూరు జవళి కార్మికులకు 1958 లో ఇవ్వవలసిన బోనస్ సమస్యను మద్రాసు ప్రభుత్వం పారిశ్రామిక ట్రిబ్యూనల్ కు పంపించింది.

ప్రముఖకళ్లజోళ్ళవ్యాపారస్థులైన
లారెన్సు & మేయో
వారు సంతోషపూర్వకంగా తెలియజేయునదేమనగా వారి స్పెషలిస్టు డాక్టరు ఎఫ్ యస్ కామా మీ నేత్రాలను పరీక్షచేసి తగిన సులోచనములనిర్ణయించి యిచ్చుటకు యీక్రింది ప్రాంతాలలో ఆయా తేదీలందు మీరు కలుసుకొనేందుకు వీలుగా విచ్చేయుదురు
బళ్లారి ఈనెల 8 9, 10 తేదీలందు ట్రావెలర్స్ బంగళాలో
అనంతపురం ఈనెల 11 12 13 తేదీలందు ట్రావెలర్స్ బంగళాలో

SINDOL
సిండాల్
తలనొప్పి
నొప్పులు
జ్వరము జలుబు
మొదలగువాటిని
అతి త్వరితముగా పోగొట్టును
సిండాల్ పౌడరు సిండాల్ బిళ్ళలు
పైపూతకు
సిండాల్ పెయిన్ బామ్
ASEPTICUS COMPANY
G P O 560 BOMBAY 1 (V)

సిరాలలో అత్యుత్తమమైనది కేమెల్ సిరా!
ఈ చికాకులకు రాకుండా చూసుకోండి ఆలోచించండి మరియు హాయిగా వ్రాసుకోండి ధారగ వచ్చే
కేమెల్
CAMEL
CML-59-3 EL

సంపాదకవర్గం మోటూరు హనుమంతరావు (అధ్యక్షులు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరి బలరామమూర్తి: విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్, కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ-2